సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 8-11-2024 15/-

# ఐక్యరాజ్య సమితి ఇప్పుడేం చేస్తుంది?








పొదుపు చేయండి
కాని పిసినారిగా మారకండి

సమాజీకవ భావవల పొత్రరాయి
వారపత్రిక
**GEETURAI WEEKLY**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 45 హైదరాబాద్
శుక్రవారం 8 నవంబర్ 2024 రూ.15-00
5 జమాది ఉల్ ఊలా 1446 హిజ్రీ

**తొలిగీటు**

ఎవరయితే పిల్లల పట్ల వాత్సల్యం కురిపించడో, పెద్దల యెడల గౌరవప్రదంగా మసలుకోడో వాడు మావాడు కాదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



22

## ధాయి రూపియా దూంగా

## లోపల...

| | | |
|---|---|---|
| హర్యానా తర్వాత ... | ...... | 04 |
| ఐక్యరాజ్య సమితి ఇప్పుడేం చేస్తుంది? | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! - 53 | ...... | 10 |
| చరితార్థులు-2 : మీర్ దాదా ఖాన్ | ...... | 13 |
| పొదుపు చేయండి, కాని పిసినారిగా మారకండి | ...... | 14 |
| అమెరికా ఎన్నికల్లో ముస్లింల మొగ్గు ఎటువైపు? | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| వీటిపై అదుపును సాధించండి | ...... | 20 |
| అప్పు : తప్పు-ముప్పు | ...... | 24 |
| హలాల్ కమాయి | ...... | 27 |
| ఆది దంపతులు ఆదమ్ హవ్వా | ...... | 28 |
| ఆరోగ్యానికి ఇస్లాం అభయం | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ | ...... | 34 |

**ఇదీ సంగతి.....**



**(టూంబ్ = సమాధి)**

కొడుకుతోని తండ్రికి
పెట్టిస్తరంట బాంబు
బావతోని బామ్మర్దికి
కట్టిస్తరంట టూంబు!

నోటికెంత వస్తె అంత
పేలడమే రాజకీయం
ఇట్లానే ఉంటుంది మరి
ఈ నేతల యవ్వారం!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# హర్యానా తర్వాత ...

**దేశంలో రాజకీయాలు** ఇప్పుడు అత్యంత అస్పష్టంగా ఉన్నాయి. నాలుగునెలల క్రితం లోక్ సభ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. నరేంద్రమోడీ ఈ ఎన్నికల్లో రికార్డు విజయం సాధిస్తారని అందరూ అనుకున్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా అలాగే చెప్పాయి. కాని ఫలితాలు అలా రాలేదు.

ఇక కాంగ్రెసు విషయానికి వస్తే, కాంగ్రెసు పని ఇక అయిపోయిందనుకున్న దశ నుంచి కాస్త పుంజుకుంది. గత 15 సంవత్సరాల్లో ఎన్నడూ కాంగ్రెసుకు ఇలాంటి విజయాలు లభించలేదు.

కాని ఆ తర్వాత హర్యానా ఫలితాలు కూడా అనూహ్యంగా వచ్చాయి. కాంగ్రెసు ఘనవిజయం సాధిస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కాని కాంగ్రెసు కూలబడింది. మరోసారి బీజేపీ ఎన్నికల్లో ఓటమెరుగని పార్టీగా నిలబడింది. లోక్ సభ ఎన్నికల్లో జరిగిందేమిటి? అప్పుడు ఓటర్లు ఏమాలోచించారు? హర్యానాలో ఓటర్లు ఏమాలోచించి ఓటు వేశారు?

హర్యానాలో కాంగ్రెసు పూర్తిగా దెబ్బతిందని చెప్పలేం. 2014 లోక్ సభ ఎన్నికలు జరిగినప్పుడు హర్యానాలో కాంగ్రెసుకు ఒక్క స్థానమే లభించింది. బీజేపీ 9 స్థానాలు గెలుచుకుంది. తర్వాత 2019లో కాంగ్రెసుకు ఒక్క స్థానం కూడా లభించలేదు. బీజేపీ అన్నీ గెలుచుకుంది. కాని 2024లో బీజేపీకి సగం స్థానాలు తగ్గి పోయాయి. కాంగ్రెసుకు వచ్చాయి.

నిజానికి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్లశాతమేమీ పెరగలేదు. కాని ప్రాంతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు రెండు పార్టీలను దెబ్బతీశారు. నిజం చెప్పాలంటే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసు దెబ్బతిందని చెప్పడం కూడా సరికాదు.

దేశంలో మారుతున్న రాజకీయాలను కూడా మనం గమనించాలి. గత పదేళ్ళుగా బీజేపీకి నరేంద్రమోడీ ప్రధాన ఎన్నికల ప్రచారకుడిగా ఉన్నారు. లోక్ సభ ఎన్నికల్లో 200 ర్యాలీలు, రోడ్ షోలు చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ఎన్నికల్లో కూడా మోడీ ప్రధానంగా ప్రచారం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో మోడీ ప్రచారం వల్ల పెద్దగా ఓట్లు రాలేదు. హర్యానా ఎన్నికల్లో మోడీ ప్రచారం పెద్దగా లేదు. రోడ్ షోలు లేవు. హర్యానాలో బీజేపీకి వచ్చిన ఓట్లన్నీ స్థానిక నేతల వల్ల వచ్చినవే.

ఇప్పుడు బీజేపీ మోడీ మ్యాజిక్‌పై ఆధారపడడం లేదన్నది మారిన రాజకీయ ముఖచిత్రంలో ముఖ్యంగా గమనించదగిన అంశం. గత సంవత్సరం కర్నాటకలో మోడీ ప్రచారంలో ప్రముఖ పాత్ర పోషించారు. కాని పార్టీ ఓడిపోయింది.

ఇప్పుడు మహారాష్ట్రలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ కూడా మోడీ ప్రచారంలో కనిపించడం లేదు. బ్రాండ్ మోడీ ఇప్పుడు కనిపించడం లేదు. మరోవైపు అధిక ధరలు, నిరుద్యోగం, ఆర్థిక పరిస్థితి ఇవన్నీ ప్రజల సమస్యలు. ఈ సమస్యల గురించి బీజేపీ నేతలు మాట్లాడడం లేదు. మతతత్వ రాజకీయాలు నడిపితే చాలనే భావిస్తున్నారు. హర్యానా ఎన్నికల ఫలితాల మాదిరిగానే మహారాష్ట్ర ఫలితాలు కూడా ఉంటాయని చాలా మంది భావిస్తున్నారు కాని వరుసగా అనూహ్య ఫలితాలిస్తున్న ఓటర్లు ఈసారి ఏం చేస్తారో చూడాలి.

అబ్దుల్ వాహెద్



# ఐక్యరాజ్య సమితి ఇప్పుడేం చేస్తుంది?

అమెరికా చెప్పుకోడానికి మాత్రమే అగ్రరాజ్యం. పేరుకు మాత్రమే సూపరు పవరు. నిజం చెప్పాలంటే అమెరికా చేతిలో పవరు లేదు. సూపరు కానే కాదు. ఈ మాటలు నేను చెబుతుంటే మీకు ఆశ్చర్యంగా ఉండొచ్చు. కాని వాస్తవాలివి.

ఇస్రాయీల్ నుంచి వస్తున్న వార్తలు విన్నప్పుడు ఇలాగే అనిపిస్తుంది. ఎందుకంటే, ఐక్యరాజ్యసమితి వల్లనే ఇస్రాయీల్ అనే దేశం ఉనికిలోకి వచ్చింది. ఐక్యరాజ్య సమితి తీర్మానాలే లేకపోతే అంతర్జాతీయంగా ఇస్రాయీల్ అనే దేశం కూడ లేదు. కాని ఇప్పుడు ఆ ఇస్రాయీల్ స్వయంగా ఐక్యరాజ్యసమితిపై కన్నెర్ర జేస్తోంది. ఐక్యరాజ్యసమితి సంస్థనే నిషేధించింది. ఐక్యరాజ్యసమితి సంస్థనే ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఇప్పుడు ఐక్యరాజ్యసమితి సంస్థపై కూడా ఉగ్రవాద సంస్థ అనే ముద్ర పడుతుందంటే అసలు ఉగ్రవాదం అంటే ఏమిటో? ఎవరికి అర్థం కాని విషయమైపోయింది.

ఐక్యరాజ్యసమితికి సంబంధించిన సంస్థను ఇస్రాయీల్ ఇలా ఉగ్రవాద సంస్థగా ప్రకటించవద్దని, నిషేధించవద్దని అమెరికా చెప్పింది. చెప్పిందనే బదులు బతిమాలుకుందంటే సరయిన పదం అవుతుంది. కాని అమెరికా చెప్పిన మాటలకు ఇస్రాయీల్ పూచికపుల్ల పాటి విలువ కూడా ఇవ్వలేదు. నిజం చెప్పాలంటే ఇస్రాయీల్ దృష్టిలో అమెరికాకు గడ్డిపోచంత విలువ కూడా లేదు. ఎందుకంటే, ఇప్పటి వరకు అమెరికా చెప్పిన ఒక్క మాటైనా ఇస్రాయీల్ విన్న ఉదాహరణ లేనే లేదు. అమెరికా ఇప్పుడు అగ్రరాజ్యం, సూపర్ పవరు అని చెప్పుకోవడం హాస్యాస్పదం. ఐక్యరాజ్యసమితికి సంబంధించిన సంస్థను

నిషేధించకుండా, ఉగ్రవాద సంస్థగా ఇష్టమొచ్చినట్లు ఇస్రాయీల్ ప్రకటిస్తుంటే అడ్డుకోలేని అమెరికా ఒక నిస్సహాయ దేశం. అమెరికా ఎంత నిస్సహాయమైన స్థితిలో ఉందంటే ఇస్రాయీల్ చెప్పింది విని తలూపడం తప్ప మరేమీ చేయలేని స్థితిలో ఉంది.

ఇస్రాయీల్ గత సంవత్సర కాలంగా అమెరికా నుంచి బిలియన్ల కొద్ది సహాయం తీసుకుంది. ఇంకా ఈ సహాయం కొనసాగుతూనే ఉంది. ఇస్రాయీల్‌కు అమెరికా ఎంత సహాయపడుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నిజం చెప్పాలంటే ఇస్రాయీల్ ఉనికి అమెరికా సహాయంపై ఆధారపడి ఉంది. కాని ఇస్రాయీల్ కన్నెర్ర చేస్తే గజగజలాడే స్థితిలో అమెరికా రాజకీయాలున్నాయి. కమలా హారిస్ కాని, డోనాల్డ్ ట్రంప్ కాని ఇద్దరు కూడా ఇస్రాయీల్ అడుగులకు మడుగులొత్తేవారే. అమెరికా ప్రజలు ఈ దయనీయ స్థితిని భరించక తప్పడం లేదు.

ఇస్రాయీల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉందని అమెరికా అధ్యక్షుడు బైడెన్, ఇప్పుడు అమెరికా ఎన్నికల పోటీలో దిగుతున్న కమలా హారిస్, డోనాల్డ్ ట్రంప్‌లు గొంతు చించుకుని, అలుపెరుగక చెబుతున్నారు. ఇస్రాయీల్ చేసేదంతా ఆత్మరక్షణే అంటూ ఇస్రాయీల్ కొనసాగిస్తున్న నరమేధాలను, హత్యాకాండలను మరిచిపోండని ప్రపంచానికి చెబుతుంటారు. కాని స్వయంగా అమెరికాలోని పత్రికలే ఇస్రాయీల్ చేస్తున్నది జాతిహననం అని చెప్పాయి.

ఇస్రాయీల్ ఆత్మరక్షణ కోసం ఇదంతా చేస్తుందా? ఐక్యరాజ్య సమితికి సంబంధించిన సంస్థను నిషేధించడం, ఉగ్రవాద సంస్థగా ప్రకటించడంలో ఎలాంటి ఆత్మరక్షణ చర్యలున్నాయో అమెరికా అధ్యక్షులుగారే సెలవిచ్చి ప్రపంచానికి అర్థమయ్యేలా చెప్పాలి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరస్ ఇస్రాయీల్‌లో ప్రవేశించకుండా నిషేధించడం ద్వారా ఇస్రాయీల్ సాధించిన ఆత్మరక్షణ ఏమిటో కూడా ఘనత వహించిన బైడెన్ గారే ప్రపంచానికి అర్థమయ్యేలా చెప్పాలి.

అక్టోబర్ 28న ఇస్రాయీల్ పార్లమెంటు రెండు చట్టాలు చేసింది. ఈ చట్టాల ప్రకారం గాజాలో యుద్ధబాధితుల కోసం సహాయ కార్యక్రమాలు చేపడుతున్న ఐక్యరాజ్య సమితి సంస్థ యుఎన్ఆర్ డబ్ల్యు ఏ ను ఇస్రాయీల్ అడ్డుకోవచ్చని అధికారాలిచ్చే చట్టం ఒకటి. యుద్ధంలో బాధితులైన సాధారణ ప్రజలు, పిల్లలు మహిళలను ఐక్యరాజ్య సమితి సంస్థ ఆదుకుంటే ఇస్రాయీల్‌కు వచ్చిన కష్టమేమిటి? ఇప్పటి వరకు ఇస్రాయీల్ చేసిన యుద్ధంలో గాజాలో అమాయక పిల్లలను చంపడం, ఆసుపత్రులపై బాంబు లేసి నాశనం చేయడం, స్కూళ్ళపై బాంబులేయడమే తప్ప యుద్ధం చేసిందెక్కడ. హమాస్‌పై యుద్ధమని చెప్పి సాధారణ పాలస్తీనా ప్రజలను ఊచకోత చేస్తుందన్నది ఇప్పుడు అమెరికా పత్రికలే రాస్తున్నాయి. హమాస్ ఎలాంటిదలాగే ఉంది. దాడులు కొనసాగిస్తూనే ఉంది. హమాస్ చేతుల్లో బందీలుగా ఉన్న ఇస్రాయీల్ పౌరులను విడిపించుకోవడం కూడా ఇస్రాయీల్ చేయలేకపోయింది. చేసిందేమిటంటే సాధారణ ప్రజలను చంపడం. ఇది యుద్ధమా? పైగా యుద్ధంలో బాధితులైన సాధారణ ప్రజలను ఆదుకునే ఐక్యరాజ్యసమితిని అడ్డుకోవడం ఇస్రాయీల్ ఆత్మరక్షణ అని అమెరికా చెబుతుంది. మనం వినాలి.

ఇక ఇస్రాయీల్ చేసిన రెండో చట్టం ప్రకారం ఇస్రాయీల్‌కు చెందిన అధికారులు లేదా సంస్థలు యుఎన్ఆర్ డబ్ల్యుతో సంబంధాలు పెట్టుకోరాదని నిషేధం విధించిన చట్టం. విచిత్రమేమిటంటే ఐక్యరాజ్యసమితికి చెందిన యుఎన్ఆర్ డబ్ల్యు అంటే The United Nations Relief and Works Agency అనే సంస్థకు హమాస్‌కు తేడా లేదని రెండూ ఒక్కటే అని ఇస్రాయీల్ చెబుతోంది. అమెరికా వింటుంది. మనల్ని నమ్మమంటుంది.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ప్రపంచంలో వివిధ దేశాల మధ్య సయోధ్య కోసం ఏర్పడిన ఐక్యరాజ్య సమితికి సంబంధించిన సంస్థపైనే ఉగ్రవాద ఆరోపణలు చేస్తే, ఐక్యరాజ్య సమితి సంస్థనే నిషేధించడం జరిగితే ఇక అంతర్జాతీయ శాంతి కోసం ఐక్యరాజ్య సమితి అనే సంస్థ ఉండడమూ, దాంట్లో వివిధ దేశాలు సభ్యదేశాలుగా ఉండడంలో అర్థమేముంది? ఈ చట్టం గురించి ఇస్రాయీల్ ఐక్యరాజ్య సమితికి సమాచారం పంపిన తర్వాత ఈ చట్టం అమలులోకి వచ్చేస్తుంది. ఈ విషయమై యుఎన్ఆర్ డబ్ల్యు ప్రతినిధి జూలియో మాట్లాడుతూ ఇదొక విపత్కర పరిస్థితి అన్నారు. ఎందుకంటే గాజాలో మానవీయ సహాయసహకారాలు అందిస్తున్న అతిపెద్ద సంస్థ యుఎన్ఆర్ డబ్ల్యు. ఈ సంస్థను ఇక్కడ పనిచేయకుండా అడ్డుకుంటే, ఈ సంస్థ చేసేపని చేయగల సామర్థ్యం మరో సంస్థకు లేదు. అంటే ఇస్రాయీల్ కోరుకునేది పాలస్తీనా ప్రజలకు ఎలాంటి సహాయమూ అందరాదు. నిజానికి ఇస్రాయీల్ చేస్తున్నది అక్కడ హమాస్‌తో యుద్ధం కాదు. హమాస్‌తో యుద్ధం సాకుతో పాలస్తీనా ప్రజలను సామూహికంగా చంపే హత్యాకాండ

కొనసాగిస్తోంది. ఇది ఎంత విచిత్రమైన పరిస్థితి అంటే, ఐక్యరాజ్య సమితి పుణ్యం కొద్ది ఉనికిలోకి వచ్చిన దేశం, ఐక్యరాజ్య సమితిలో సభ్యదేశం, ఐక్యరాజ్య సమితికి చెందిన సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. అది కూడా మానవీయ సహాయ సహకారాలు అందించే సంస్థను నిర్మూలించే కార్యక్రమాలు చేపట్టింది.

గ్లోబల్ ఆర్డర్ గురించి గొప్పగా మాట్లాడే అగ్రరాజ్యం, దానికి వంతపాడే పాశ్చాత్య దేశాలు ఐక్యరాజ్య సమితికి పట్టిన ఈ దుర్గతి గురించి ఏమన్నా చెబుతున్నారా? వారి మాటలేవీ ఎక్కడా వినబడడంలేదు. అమెరికా... ఈ సంఘటనపై చాలా ఆందోళన, విచారాలు వెలిబుచ్చింది. అంతకన్నా పాపం ఒక నిస్సహాయ దేశం ఏం చేయగలదు? లక్షలాది పాలస్తీనీయులు, ముఖ్యంగా గాజా వాసులు ఇప్పుడు అన్నపానీయాలతో పాటు విద్యావసతి కోసం యుఎన్ఆర్ డబ్ల్యుపై ఆధారపడి ఉన్నారు. ఈ మాటలు కూడా అమెరికా చెప్పింది. కాని పాపం ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంది. జర్మని, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు కూడా ఒక సంయుక్త ప్రకటనలో ఇస్రాయీల్‌ను ఐక్యరాజ్య సమితికి చెందిన సంస్థపై నిషేధం విధించరాదని చెప్పాయి. ఈ దేశాలు అంతకన్నా చేసేది కూడా ఏమీ లేదు. ఈ దేశాలన్నీ ఇస్రాయీల్ మిత్రదేశాలు. యుఎన్ఆర్ డబ్ల్యు పై నిషేధం అంతర్జాతీయ చట్టానికి విరుద్ధమని చెప్పిన దేశం టర్కీ. యురోపియన్ యూనియన్ ప్రతినిధి జోసెఫ్ బొరెల్ కూడా చాలా విచారం వెలిబుచ్చారు. ఐర్లాండ్, నార్వే, స్లోవేనియా, స్పెయిన్ దేశాలు ఈ ఏడాదే పాలస్తీనా ప్రత్యేక దేశానికి గుర్తింపునిచ్చిన దేశాలు. ఈ దేశాలు ఇస్రాయీల్ చర్యలను ఖండిస్తూ ప్రకటనలు చేశాయి. బెల్జియం కూడా తీవ్రంగానే ప్రతిస్పందించింది.

ఇస్రాయీల్ ఏం చేసినా ఐక్యరాజ్యసమితిలో చెల్లుతుంది. ఎందుకంటే అమెరికా అనే సోకాల్డ్ అగ్రరాజ్యం ఇస్రాయీల్ అడుగులకు మడుగులొత్తుతుంది. ఇంతకు ముందు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరస్ ఈరాన్‌ను విమర్శించలేదనే కారణం చూపించి ఆయన ఇస్రాయీల్‌లో ప్రవేశించకుండా నిషేధం విధించారు. గుటెరస్ కూడా ఇస్రాయీల్ చట్టాలపై వ్యాఖ్యానిస్తూ చాలా విచారకరమైన చర్యలన్నారు. ఈ చట్టాలు పాలస్తీనా శరణార్థులను లక్ష్యంగా చేసుకున్న చర్యలన్నారు. ఈ సమస్యను ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో చర్చకు పెడతామన్నారు.

The United Nations Relief and Works Agency లేదా యుఎన్ఆర్ డబ్ల్యు గాజాలో సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 19 లక్షలకు పైబడి పాలస్తీనా పౌరులు ఇస్రాయీల్ దమనకాండల వల్ల తమ ఇళ్ళు వాకిళ్ళు వదిలి ఇక్కడ శరణార్థులుగా జీవిస్తున్నారు. గాజాలో ఆహారకొరత ఉంది. మంచినీటి కొరత ఉంది. ఔషధాలు లభించడం లేదు. ఆకలి చావులు, వ్యాధుల సమస్యలున్నాయి. గాజాలో భయంకరమైన పరిస్థితులున్నాయి. ఏడాదిగా ఇస్రాయీల్ కొనసాగిస్తున్న యుద్ధం వల్ల వేలాది మంది పిల్లలు, మహిళలు మరణించారు. అనేక కుటుంబాలు నాశనమయ్యాయి. అంతర్జాతీయంగా అనేక దేశాలు ఇస్రాయీల్ వైఖరిని నిస్సందేహంగా విమర్శించాయి. విమర్శించిన వారిలో అమెరికా పాశ్చాత్యదేశాలు కూడా ఉన్నాయి. కాని ఇస్రాయీల్‌ని అడ్డుకోడానికి చేసింది ఏదీ లేదు. నిస్సహాయ దేశాలు కదా.

అమెరికా విదేశాంగ మంత్రి అంటోని బ్లింకెన్ గారు ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహును కలిసి గాజాలో సహాయ సామగ్రి సరఫరాకు సహాయపడాలని కోరారట. కోరారో, వేడుకున్నారో మనకు తెలియదు. కాని ఇస్రాయీల్ మాత్రం సహాయ కార్యక్రమాలు చేస్తున్న సంస్థను నిషేధించి అమెరికాకు ఎంత విలువ ఉందో ప్రపంచానికి చెప్పింది.

గత సంవత్సరం హమాస్ చేసిన దాడుల్లో యుఎన్ఆర్ డబ్ల్యు కార్యకర్తలు కూడా కొందరున్నారని ఇస్రాయీల్ చెబుతోంది. కాని ఇస్రాయీల్ చెప్పిన మాటలేవి ఇంతవరకు నిజాలుగా నిరూపితం కాలేదు. చెప్పినవన్నీ అబద్ధాలే. చిన్నపిల్లల గురించి ఇస్రాయీల్ చెప్పింది అబద్ధం. అదే అబద్ధాన్ని నిస్సిగ్గుగా అమెరికా అధ్యక్షుడు కూడా మళ్ళీ చెప్పాడు. హిజ్బుల్లా బంగారం గురించి ఇస్రాయీల్ చెప్పింది. అది కూడా అబద్ధమని తేలింది. ఇలాంటి అబద్ధాలు చాలా ఉన్నాయి. హమాస్ దాడుల్లో ఐక్యరాజ్య సమితికి చెందిన సంస్థ కార్యకర్తలున్నారని ఇస్రాయీల్ చెబుతుంటే దానికి ఆధారాలేమిటి? అబద్ధాల పుట్ట వంటి ఇస్రాయీల్ మాటలెవరు నమ్మగలరు?

యుఎన్ఆర్ డబ్ల్యు ఈ విషయమై స్పష్టత కూడా ఇచ్చింది. తమ కార్యకర్తల్లో అనుమానాస్పదంగా ఎవరైనా ఉంటే వెంటనే తొలగిస్తామని వివరణ కూడా ఇచ్చింది. ఇస్రాయీల్ ఆరోపణల తర్వాత జరిగిందేమిటంటే, యుఎన్ ఆర్ డబ్ల్యుకు విరాళాలిచ్చే వారు కొంతమంది విరాళాలు ఆపేశారు. తర్వాత ఇలా విరాళాలు ఆపేసిన వారు మళ్ళీ కొందరు విరాళాలు కొనసాగించడం

ప్రారంభించారు. యుఎన్ ఆర్ డబ్ల్యు హమాస్ కోసం పనిచేస్తుం దని ఇస్రాయీల్‌కు అనుమానాలుంటే, ఆ సంస్థ స్థానంలో మరో సంస్థకు అనుమతిని ఇచ్చే అవకాశాలు చట్టంలో ఉండాలి. కాని ఇస్రాయీల్ చేసిన చట్టంలో గాజాలోని శరణార్థుల సహాయ సహకారాలకు ఎలాంటి సంస్థలను అనుమతించే అవకాశమే లేదు. అంటే ఇస్రాయీల్ కోరుకునేది ఏమిటో స్పష్టంగా అర్థమవు తోంది. చిన్నపిల్లలు చదువుకునే స్కూళ్ళపై, ఆసుపత్రులపై, జర్నలిస్టులున్న ఇళ్ళపై బాంబులు వేసి అదే యుద్ధమని, ఆత్మ రక్షణ అని చెప్పుకునే ఇస్రాయీల్ వంటి అమానుష దేశం యుద్ధబాధితుల సహాయ సహకారాలను అనుమతించడం జరుగుతుందా? ఇస్రాయీల్ చేస్తున్నది హమాస్‌పై యుద్ధం కాదు. గాజాలో పాలస్తీనా పౌరులందరిని హతమార్చే జాతి హననం.

ఇప్పుడు ఇస్రాయీల్ చేసిన ఈ చట్టాల తర్వాత ఐజ్యరాజ్య సమితితో ఇస్రాయీల్ సంబంధం తెగిపోయిందని చెప్పాలి. 1947లో ఐక్యరాజ్య సమితి వల్లనే ఇస్రాయీల్ అనే దేశం ఉనికిలోకి వచ్చింది. అప్పట్లో పాలస్తీనాగా ఉన్న దేశాన్ని అరబ్బు ప్రాంతం, యూదప్రాంతంగా రెండు ముక్కలు చేసి ఇస్రాయీల్ దేశాన్ని ఐక్యరాజ్యసమితి తీర్మానం ఆధారంగా ఏర్పాటు చేశారు. ఆ వెంటనే ఇస్రాయీల్ దమననీతి ప్రారంభమైంది. అప్పట్లోనే దాదాపు ఏడున్నర లక్షల మంది పాలస్తీనా ప్రజలు తమ దేశాన్ని కోల్పోయి, ఇళ్ళు వాకిళ్ళు వదిలి శరణార్థులయ్యారు. నక్బాగా ఈ సంఘటనను పిలుస్తారు. పాలస్తీనా చరిత్రలో ఇది అతిపెద్ద సంఘటన. అదే సంవత్సరం యుఎన్‌ఆర్ డబ్ల్యు స్థాపించ బడింది. అప్పట్లోనే ఇస్రాయీల్‌కు కూడా ఐక్యరాజ్యసమితిలో సంపూర్ణ సభ్యదేశంగా స్వీకరించడం కూడా జరిగింది. అప్పుడు ఏర్పడిన యుఎన్‌ఆర్ డబ్ల్యు అప్పటి నుంచి పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తోంది. అప్పుడు ఏడున్నర లక్షల మంది పాలస్తీనీ యులు శరణార్థులయ్యారు. ఇప్పుడు తమ దేశంలోనే 20 లక్షల మంది పాలస్తీనా ప్రజలు శరణార్థులయ్యారు. గాజా, వెస్ట్ బ్యాంక్, జెరూసలేం, జోర్డన్, లెబనాన్‌లలో కూడా యుఎన్‌ఆర్ డబ్ల్యు పనిచేస్తోంది.

అసలు పాలస్తీనీయులను శరణార్థులుగా గుర్తించడాన్ని కూడా ఇస్రాయీల్ వ్యతిరేకిస్తోంది. పాలస్తీనా భూభాగం నుంచి వారిని తరిమేసిన ఇస్రాయీల్ ఈ శరణార్థులకు తిరిగి వచ్చే హక్కు అధికారాలు లేవంటుంది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ స్వయంగా ఇస్రాయీల్ ప్రధానికి లేఖ రాసి పాలస్తీనా శరణార్థులకు సహాయమందిస్తున్న యు ఎన్ ఆర్ డబ్ల్యు సంస్థపై నిషేధ చట్టం చేయవద్దన్నారు. కాని ఎవరేం చెప్పినా ఇస్రాయీల్ ప్రధాని వినడం లేదు. అమెరికాలో పన్నులు కట్టే వారి డబ్బు ఇస్రాయీల్ కు సరఫరా అవుతున్నంత కాలం ఇస్రాయీల్ ఎవరి మాట వినదు. గాజాలో 190 మంది ఐక్యరాజ్యసమితి కార్యకర్తలను ఇస్రాయీల్ హతమార్చింది. అనేక కార్యాలయ భవనాలను ధ్వంసం చేసింది. ఐక్యరాజ్య సమితి నడిపే స్కూళ్ళపై కూడా బాంబులు వేసి ధ్వంసం చేసింది. యుఎన్‌ఆర్ డబ్ల్యు పై ఇస్రాయీల్ చేస్తున్న విషప్రచారాన్ని ప్రపంచం చూస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఈ సంస్థ ప్రతినిధులు చెబుతున్న మాటలు వింటుంది. కాని ఎవరూ ఏమీ చేయడం లేదు. అంటే ఇస్రాయీల్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినా కేవలం విచారాలు వ్యక్తం చేయడం తప్ప ఎవరూ చేసేది ఏదీ లేదు. అంతకు ముందు గాజాలో, జెరూసలేంలో, వెస్ట్ బ్యాంకులో ఇస్రాయీల్ నిరంతరాయంగా కొనసాగిస్తూ వచ్చిన దమనకాండ విషయంలో కూడా ఇదే జరిగింది. ఆ తర్వాతనే హమాస్ దాడి జరిగిందన్నది గుర్తించాలి. కేవలం హమాస్ దాడితో ఇదంతా ప్రారంభమైందనుకునే వారు ఇదంతా మరిచిపోతున్నారు. హమాస్ దాడి తర్వాత కూడా ఇస్రాయీల్ చేస్తున్నది హమాస్‌పై యుద్ధం కాదు. పాలస్తీనా ప్రజలపై యుద్ధం. సాధారణ ప్రజ లను చంపుతోంది. గాయపడిన వారు మందులు వైద్యం లేకుండా మరణించేలా ఆసుపత్రులపై బాంబులు వేస్తోంది. పాలస్తీనా ప్రజలకు పచ్చి మంచినీళ్ళు కూడా లభించకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది.

గాజాలో సాధారణ ప్రజలకు ఎలాంటి సహాయం లభించకుండా చేయాలనేదే ఇస్రాయీల్ ప్రయత్నం. సామూహికంగా పాలస్తీనా ప్రజలందరినీ శిక్షించి, తన ఆధిపత్యం కొనసాగించాలనేదే అసలు ప్రయత్నం. కాని దీని వల్ల మరింత మంది హమాస్ పట్ల ఆకర్షితులవుతున్నారు. హమాస్ నాయకులను చంపిన ప్రతిసారి ఇస్రాయీల్ ఇక హమాస్‌ను తుడిచిపెట్టేశామని చెబుతుంది. మళ్ళీ హమాస్ తలెత్తి నిలబడుతోంది. నెతన్యాహు వంటి నాయకుడి అధికార పిపాస ఇస్రాయీల్ దేశాన్ని నిరంతర యుద్ధంలో మునిగేలా చేస్తోంది.

హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇస్రాయీల్ పౌరుల పరిస్థి తేమిటి. వారి కుటుంబ సభ్యులు ఇస్రాయీల్ ప్రధానిని కలవ డానికి గత ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నా ఎవరికీ

అనుమతి ఇవ్వలేదు. ఇస్రాయీల్ ప్రధాని ప్రసంగాన్ని ఈ కుటుంబాలు అడ్డుకుని సభలో హంగామా చేసిన వార్తలు కూడా వచ్చాయి. కాని నెతన్యాహు మాత్రం బందీలను విడిపించుకునే ప్రయత్నాలు చేయడం లేదు. యుద్ధాలు కొనసాగిస్తూ ఉంటే తన అధికారం పదిలంగా ఉంటుందని చూస్తున్నాడు. ఐక్యరాజ్య సమితిలో నెతన్యాహు ప్రసంగాన్ని అమెరికా దాని మిత్రపక్షాలు తప్ప మిగిలిన దేశాలన్నీ బహిష్కరించి వాకౌట్ చేశారు. ఖాళీ సభలో నెతన్యాహు చేసిన ప్రసంగాన్ని, గొప్ప ప్రసంగంగా అమెరికా పాశ్చాత్య మీడియా ప్రచారం చేసుకుంది.

ఇప్పుడు అమెరికాలో ఎన్నికలు జరుగుతున్నాయి. కమలా హారిస్ ఈ సారి ఎన్నికల్లో ఓడిపోతే దానికి పెద్ద కారణం ఇస్రాయీల్‌కు బైడెన్ ఇస్తున్న మద్దతు. ఈసారి డెమొక్రటిక్ పార్టీ ఓడిపోతే దానికి కారణం ఇస్రాయీల్. కమలా హారిస్ కూడా ఇస్రాయీల్ కు ఇస్తున్న మద్దతును సమర్థిస్తూ చాలా సార్లు మాట్లాడారు. కాని డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినా ఇస్రాయీల్ మద్దతు విషయంలో ఇదే విధానాన్ని పాటిస్తారన్నది అందరికీ తెలిసిన విషయమే. పైగా ట్రంప్ మరింత ఎక్కువగా ఇస్రాయీల్ పక్షపాతిగా నిలబడతాడు. ఏది ఏమైనా ఇప్పుడు ప్రపంచంలో సమీకరణాలు మారిపోతున్నాయి. ఈరాన్, సౌదీల మధ్య సయోధ్య కుదిరింది. అమెరికాను ఇప్పుడు సౌదీ అంతగా నమ్మడంలేదు. మరోవైపు టర్కీ నాటోకు బై బై చెప్పడానికి సిద్ధపడుతోంది. మిలటరీ డ్రోన్ల విషయంలో ఇప్పుడు టర్కీకి ప్రపంచంలో ఎదురు లేదు. అమెరికా మార్కెటును టర్కీ లాగేసుకుంది. అమెరికా డాలర్‌కు సవాళ్ళు ఎదురవుతున్నాయి. బ్రిక్స్ బలపడుతోంది. ఇస్రాయీల్ బెదిరింపులకు ఈరాన్ బెదరడం లేదు సరికదా, ఇస్రాయీల్‌పై ప్రత్యక్ష దాడులతో ఇస్రాయీల్ సైనిక సామర్థ్యంలో వాస్తవమెంతో ప్రచారమెంతో ప్రపంచానికి తెలియజేసింది. ఇస్రాయీల్ ప్రతిదాడిని ఈరాన్ ఎదుర్కొన్న తీరు కూడా ప్రపంచంలో చర్చనీయాంశం అయ్యింది. అమెరికా గొప్పగా చెప్పుకునే ఎఫ్ 35 యుద్ధ విమానాలు ఈరాన్ నుంచి తోకముడిచి వెనక్కు తగ్గవలసి వచ్చిందన్న వార్తలు అమెరికా యుద్ధ విమానాల ప్రతిష్ఠను దెబ్బతీశాయి. హిజ్బుల్లా, హమాస్ చేస్తున్న దాడులు ఇస్రాయీల్ ఐరన్ డోమ్ బలమెంతో బీటలెన్ని ఉన్నాయో ప్రపంచానికి చెప్పాయి. ఇప్పుడు చాలా వాస్తవాలు ప్రపంచదేశాల ముందుకు వచ్చాయి. ఇస్రాయీల్ ఎలాంటి అమానుష దేశమో, ఎలా పసిపిల్లలను మహిళలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుందో కూడా ప్రపంచానికి తెలిసింది.

మధ్యప్రాచ్యంలో రగులుతున్న ఈ మంటలు త్వరలో ఆరి పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలని కోరుకుందాం. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

అధ్యాయం -19

53

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

### పారిభాషిక పదాల భావం

మహనీయ అలీ (ర) ఇస్లామీయ పారిభాషిక పదాలను అనన్యంగా విశదీకరించారు.

**తక్వా:** చెడుపైన పట్టు వహించకపోవడం, తన దైవ విధేయత పట్ల మోసపోకపోవడం. మహోన్నత ప్రభువు దైవం పట్ల భయం, ఆయన అవతరింపజేసిన ఆదేశాలను అమలు పరచడం, ప్రాప్తమయిన కొద్ది పాటికి సంతుష్టి, ప్రపంచాన్ని వీడి పోయే సన్నాహాలు.

**అదృష్టం:** భువిలో సంభవించే ప్రతి విషయం, ఆకాశంలో దాని నిర్ణయం జరగనంత వరకు సంభవించదు. ప్రతి వ్యక్తి రక్షణ కొరకు ఇద్దరు దైవ దూతలు నియమించబడి ఉన్నారు, కాని అతని అదృష్ట సమయం ఆసన్నమయినప్పుడు ఆ దైవ దూతలు అతనికి దూరంగా వెళ్ళిపోతారు, అదృష్టం పూర్తవు తుంది. నాకూ దైవం కల్పించిన డాలు ప్రాప్తమయి ఉంది, నా అంతం వాటిల్లినప్పుడు నా డాలు ముగిసిపోతుంది.

ఒక వ్యక్తి విశ్వాసపు కమ్మదనాన్ని ఆస్వాదించాలంటే అతను అదృష్టాన్ని విశ్వసించనంతవరకు అది సంభవించదు. అంటే అతనికి ప్రాప్తమయినది ఎన్నడూ దోచుకోబడదు, ఇంకా అతనికి ప్రాప్తం కానిది ఎన్నడూ ప్రాప్తం కాజాలదు. ప్రతి వ్యక్తి ధన ప్రాణాల హాని లేదా సుఖం, ఆకాశం నుంచి వర్షం కురిసినట్లే అవతరిస్తుంది, కనుక ఒక వ్యక్తికి ధన ప్రాణాల నష్టం వాటిల్లినట్లయితే అతను దాన్ని తనకు పరీక్ష గా ఎంచరాదు. దానికి బదులు ఒక ముస్లిమ్ అల్లాహ్ ప్రసా దించే రెండు శుభాలలో ఏదో ఒకదాన్ని ఆశించాలి. దేవుని ఖజానాలో ఉన్నదే తనకు మేలయినది అని భావించాలి. ఇక అల్లాహ్ అతనికి ధనం సంతానాలయినా అనుగ్రహి స్తాడు, అతను ధన సంతానాలతో తన ధర్మాన్ని కాపాడు కుంటూ జీవితాన్ని కొనసాగనిస్తాడు, లేదా ఆ వర ప్రసాదాల కొరతతోనే పరలోక వరప్రసాదాలకు అర్హుడవుతాడు. పరలోకమయితే ఆసాంతం శుభం, నిత్యం ప్రాప్తమయి ఉండే శుభం!

**సాగు:** సాగుదల రెండు విధాలు. ఒకటి ప్రాపంచిక ధనసంప దలు, భయభక్తులది. మరి రెండవది, పరలోకంలో మిగిలి కొనసాగే సత్కార్యాలది. ఒక్కోసారి దైవం భాగ్య వంతులకు రెండూ అనుగ్రహిస్తాడు.

**దాసుల లెక్కలు:** ఆయన్ని అడగటం జరిగింది, 'దైవం ఇంత పెద్ద ఎత్తున జనాల (కోటాను కోట్ల జనుల) లెక్కలు ఏ

విధంగా అడుగుతాడూ?' అని. దానికి ఆయన(ర), "ఏ విధంగానయితే ఇంత పెద్ద ఎత్తున జనాలకు ఆహారం అనుగ్రహిస్తున్నాడో అదే విధంగా!" అని సమాధానం ఇచ్చారు.

## "నన్ను వంచించ లేవు"

ఒక ఉల్లేఖనం ప్రకారం అమీరుల్ మూ'మినీన్ మహనీయ అలీ(ర) వద్దకు బైతుల్ మాల్(ప్రభుత్వ ధనాగారం) అధికారి వచ్చి ధనాగారం పూర్తిగా నిండి, ఏ మాత్రం చోటు లేకుండా పోయిందని విన్నవించుకున్నాడు. వినగానే ఆయన(ర) నోటి నుంచి "అల్లాహు అక్బర్" అన్న పలుకులు వెలువడ్డాయి. బైతుల్ మాల్ ఉన్న చోటికి వచ్చి చూశారు. ఆ పైన జన సామాన్యాన్ని పిలువ నంపారు. సామాన్య ప్రకటన ద్వారా పిలువడం జరిగింది. జనం చేరిన తరువాత బైతుల్ మాల్‌లో ఉన్నదంతా జనుల్లో పంచి పెట్టారు. జనులకు వెండి బంగారాలు ఇస్తూ, "వెండి బంగారమా, నీవు మరెవరినయినా మోసపుచ్చగలవేమో, నన్ను కాదు" అంటూ పోయారు. ఏ చిన్న పెద్ద నాణెమూ వదిలి పెట్టలేదు, అంతా పంచివేశారు. ఆ తరువాత బైతుల్ మాల్‌ని పరిశుభ్రం చేయించారు, అందులో రెండు రక'తుల నమాజ్ చేశారు.

జనం సాధారణంగా సిరిసంపదల్ని పెద్దవిగా భావిస్తారు. కాని సిరి సమృద్ధతను గురించి తెలుసుకుని ఆయన నోటి నుంచి వెలువడిన మాట 'దైవం గొప్పవాడ'న్నది. దైవం గొప్ప వాడయినప్పుడు విశ్వాస స్పృహ గల ఓ ముస్లిమ్ స్వల్ప వస్తువులను ఎలా కోరుకుంటాడు?

చలికాలంలో ఒకసారి మహనీయ అలీ(ర) ఓ పాతబడ్డ దుప్పటి కప్పుకుని కనిపించారు. ఆయన బాగా వణుకుతున్నారు. ఓ అధికారి, "అమీరుల్ మూ'మినీన్! మీ కొరకు, మీ ఇంటి వారల కొరకు బైతుల్ మాల్ లో భాగముంది, కాని తమరు ఈ వైఖరిని ఎందుకు అవలంబిస్తున్నారో బోధపడటం లేదు." అని అడిగారు. అది విని ఆయన(ర), "దైవం మీద ఒట్టు! నేను మీ సొత్తు నుంచి ఏమీ తీసుకోను. ఈ దుప్పటి కప్పుకునే నేను మదీనా నుండి ఇక్కడికి వచ్చాను" అన్నారు.

## ప్రపంచమా! తొలిగిపో

ఓ ఉల్లేఖన కర్త మహనీయ ముఆవియా (ర) సమక్షంలో ఇలా చెప్పారు, "మహనీయ అలీ (ర) రేచీకటిలో గూటిలో కూర్చొని, గడ్డం పట్టుకుని అసహనంగా పాము కాటేసిన వ్యక్తిలా అటూ ఇటూ మరలుతూ ఉండే వారు, ఎంతో దుఃఖితునిలా వగిచేవారు. ఇప్పటికీ ఆయన స్వరం నా చెవిలో మ్రోగుతూ ఉంది, 'ఓ నా ప్రభూ, ఓ నాప్రభూ' అన్న పదాలు మాటి మాటికీ పలుకుతూ ఉండే వారు. దైవ సన్నిధిలో రోదిస్తూ వేడుకునేవారు.

"ప్రపంచాన్ని సంబోధించి 'ప్రపంచమా తొలిగిపో, నన్ను వదలి మరెవరినయినా మోసగించు. నేను నీకు ఖచ్చితంగా విడాకులు ఇచ్చివేశాను. నీ అయుష్షు బహు స్వల్పం, నీ సాంగత్యం అతి నీచం. నా వద్ద నీ విలువ లేదు."

"ఓహ్! దారి బత్తెం బహు స్వల్పం, ప్రయాణం బహు దీర్ఘం, దారులు భయంకరం." అంటూ రోదించే వారు."

ఒక సారి మహనీయ అలీ(ర) రాత్రి నమాజ్ చేసుకుంటూ ఉండగా ఒకరు వచ్చి చూశారు, "అమీరుల్ మూ'మినీన్! పగలు ఉపవాసం రాత్రి నమాజ్, ఏమిటిది? మీకు అలుపు కలగదా? దానికి ఆయన(ర) ఇలా అన్నారు, "పరలోక ప్రయాణం సుదీర్ఘం, రాత్రి పూట కూడా నడిస్తేనే గమ్యం చేరుకుంటారు."

## ఆచరణ శూన్యులయిన జ్ఞానులు

మహనీయ అలీ(ర) ఒక సందర్భంలో ఇలా అన్నారు,

"ఓ జ్ఞాన సంపన్నులారా! జ్ఞానాన్ని మీరు ఆచరణలోనూ పెట్టండి. తన జ్ఞానం ప్రకారం ఆచరణను. మలచిన వాడే, జ్ఞానం, ఆచరణల్లో అనుగుణ్యం కలవాడే, నిజమయిన పండితుడు. ఓ కాలం రాబోతోంది, అప్పుడు జనులు జ్ఞానాన్ని మెండుగా సంపాదిస్తారు, కాని అది వారి కంఠానికి లోపల దిగదు. వారి ఆంతర్యం, బాహ్యానికి భిన్నంగా ఉంటుంది. వారి జ్ఞానం, ఆచరణల్లో వైరుధ్యం ఉంటుంది. ఇటువంటి జనులు ఓ చోట చేరి కూర్చొని ఒకరినొకరు పొగడి గర్వం వ్యక్తం చేసుకుంటారు. వారి సహవాసి ఎవరయినా మరొక కూటమిలో కూర్చుంటే అతనిపై మండిపడతారు. వీరి ఆచరణలు దైవం వద్దకు చేరనే జాలవు."

## సలహా సంప్రతింపులు

మహనీయ అలీ(ర) నిర్దేశన, "సలహాలను అర్థించడం, స్వయంగానే మార్గబోధన. ఎవరయితే తానే సర్వ జ్ఞాని అని తలుస్తాడో అతను సదా ప్రమాదాల్లో చిక్కులకు గురవుతూ

ఉంటాడు. సలహా సంప్రతింపులు జరపడం అత్యుత్తమ సహకారం ."

## ఈజిప్టు గవర్నర్‌కు నిర్దేశన

మహనీయ అలీ(ర) అష్తర్ నఖయీని ఈజిప్టుకు గవర్నర్‌గా నియమించి పంపుతూ ఆయనకు ఇచ్చిన నిర్దేశనల్లో ఒకటి,

"నీవు నియమించే కలెక్టర్‌లను సదా కనిపెడుతూ ఉండాలి. వారి నియామకంలో న్యాయం పాటించు, ఒకరి సాన్నిహిత్యం, ప్రేమ, వారి ఎన్నికకు మూలం కారాదు. ప్రాధాన్యతలు, వ్యక్తిగత ఇష్టాయిష్టాలు అన్నవి అక్రమం, విద్రోహాలకు సమానం. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజల సమస్యలు పరిష్కరించబడాలంటే, ఈ సమస్యల పరిష్కారానికి సహాయపడేవారి సమగ్ర సంస్కరణ జరగనంత వరకు అది సాధ్యపడదు."

## ఇస్లామీయ న్యాయం

మహనీయ అలీ(ర), మహనీయ ముఆవియా(ర) కెదురుగా బయలుదేరినప్పుడు తన కవచం ఒకటి తక్కువగా ఉందని గమనించారు. అటు నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఒక రోజు ఓ యూదు వ్యక్తి చేతిలో ఆ కవచం కనిపించింది. దాన్ని అతను అమ్ముతున్నాడు. ఆయన అతన్ని పట్టి అడిగారు, "ఈ కవచం నాది. నేను దీన్ని అమ్మనూ లేదు, ఎవరికయినా దానమూ చేయలేదు" అని. దానికి యూదు, "అదేం కాదు, ఇది నాదే." అన్నాడు.

"ఇక న్యాయస్థానం వెళ్దాము" అన్నారు మహనీయ అలీ(ర). అలా ఇద్దరూ న్యాయస్థానం వెళ్ళారు. మహనీయ అలీ(ర) కాజీ(న్యాయమూర్తి) వద్ద కూర్చున్నారు. యూదు వ్యక్తి ఎదురుగా కూర్చున్నాడు.

కాజీ అడిగారు, "అమీరుల్ మూ'మినీన్! ఏమిటి ఈ వ్యవహారం?" అని.

ఆయన, "ఇతని చేతిలో ఉన్న కవచం నాది. నేనెవరికీ అమ్మనూలేదు, మరెవరికయినా దానమూ చేయలేదు" అని చెప్పారు.

"అమీరుల్ మూ'మినీన్! ఏదయినా ప్రస్ఫుటమయిన ఆధారం చూపండి" అడిగారు కాజీ.

"నా నౌకరు, నా కుమారులిద్దరు సాక్ష్యం" అన్నారు అలీ(ర).

"తండ్రి విషయంలో కుమారుని సాక్ష్యం చెల్లదు" అన్నారు కాజీ.

ఫలితంగా యూదుని పక్షంలో తీర్పు చెప్పారు కాజీ.

యూదు వ్యక్తి చకితుడయిపోయాడు. ఇదీ ఇస్లామీయ న్యాయం అని గమనించి యూదు కళ్ళు తేలేశాడు, "నేను కవచాన్ని తీసుకుంటే వ్యవహారాన్ని అమీరుల్ మూ'మినీన్ న్యాయ స్థానానికి ఎక్కించారు. అయితే న్యాయమూర్తి ఆయనకే వ్యతిరేకంగా తీర్పు ఇస్తారా?

నేను సాక్ష్యం ఇస్తున్నాను, "అష్హదుఅల్ లాఇలాహ ఇల్లల్లాహ్ వ అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్" అని సద్వచనం పఠించి ముస్లిమయ్యాడు యూదు వ్యక్తి. వెంటనే, "ఈ కవచం మీదే, మీరు మీ ఒంటెనెక్కి సిఫ్ఫీన్ వైపునకు వెడుతూ ఉండగా ఇది పడిపోయింది, నేను ముందుకేగి అందుకున్నాను" అన్నాడు యూదుడు.

అప్పుడు గుర్రం దిగి మహనీయ అలీ(ర), "నీవు అంగీకరించావు గనక ఇక ఇది నీదే!" అన్నారు.

ఆ తరువాత అతను యుద్ధంలో పాల్గొంటూ ఉండగా అనేక మంది చూశారు.

## కూతురుకు ఇచ్చిన కానుక

అస్ఫహాన్ గవర్నర్ వస్తూ బైతుల్‌మాల్ సొత్తులో ధనంతో పాటు కొన్ని తోలు తిత్తులు కూడా తెచ్చారు. వాటిలో తేనె, నెయ్యి ఉన్నాయి. ఉమ్మె కుల్సూమ్ (మహనీయ అలీ కూతురు) గవర్నర్ వద్ద నుంచి నెయ్యి, తేనె తెప్పించుకున్నారు. రెండు పాత్రల్లో అవి రెండూ వేసి పంపారు గవర్నర్.

మరుసటి రోజు అలీ (ర) వచ్చి, తేనె, నెయ్యి ప్రజల్లో పంచిపెట్టడానికి ముందుకు తెమ్మన్నారు. కొరవడిన రెండు తిత్తులూ గవర్నర్ దాచిపెట్టారు. అందువల్ల వాటిలో రెండు తక్కువ కావడం గమనించారు అలీ(ర). వాటిని గురించి వాకబు చేశారు ఆయన. గవర్నర్ దానికి, "ఇదో, ఇప్పుడే తెప్పిస్తాను" అన్నారు గవర్నర్. మహనీయ అలీ(ర) గట్టిగా అడిగితే అసలు విషయం చెప్పారు. అలీ(ర) వాటిని తెప్పించి చూస్తే పదార్థాలు తక్కువగా ఉన్నాయి.


మహనీయ అలీ(ర) వ్యాపారుల్ని పిలిపించి కొరవడిన దాని విలువ అంచనా వేయించారు. వాటి విలువ మూడు దిర్హములని నిర్ణయమయింది, ఆ రొక్కం సయ్యిదా ఉమ్మె కుల్సూమ్ వద్ద నుంచి తెప్పించారు. మిగతా తేనె, నెయ్యి జనుల్లో పంచివేశారు. ✤



# మీర్ దాద్ ఖాన్

## ( -1946)

63




**భారత స్వాతంత్ర్య సంగ్రామ** చరిత్రలో ఆఖరి ఘట్టంగా ఖ్యాతి చెందిన 'భారత నౌకాదళం తిరుగుబాటు'కు మద్దతుగా వెల్లువెత్తిన ప్రజాందోళనలో చురుకైన పాత్రను నిర్వ హించిన యోధాగ్రేసరుడు మీర్ దాద్ ఖాన్. బ్రిటిష్ పాలకుల పట్ల తొలి నుండి వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తూ వచ్చిన మీర్ దాద్ గదర్ పార్టీ నాయకుల సాన్ని హిత్యంలో బ్రిటిష్ వ్యతిరేక చర్యలలో భాగస్వాములయ్యారు. 1917లో 'బోల్షివిక్ విప్లవం' విజయం తరువాత రష్యాకు వెళ్ళిన మీర్ దాద్ ఖాన్ అక్కడి విశ్వవిద్యాలయంలో 'కమ్యూనిజం' అధ్య యనం చేసి తిరిగి వచ్చి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో నిమగ్నమయ్యారు. 'భారత సైనిక శక్తి' భరోసాతో ఇక ఇండియాను పాలించడం కష్టమని ఆంగ్లే యపాలకులు నిర్ణయానికి రావడంలో నిర్ణాయక పాత్ర వహించిన 'భారత జాతీయ సైన్యం' రగిల్చిన స్ఫూర్తికణం 'రాయల్ నౌకాదళం తిరుగుబాటు'. భారతీయ నావికుల పట్ల ఆంగ్లేయాధికారులు చూపుతున్న అంతులేని వివక్షకు వ్యతిరేకంగా 1946 ఫిబ్రవరి 18న బ్రిటిష్ నౌకాదళంలోని భారతీయులు తిరగబడి సమ్మె బాట పట్టారు. 'జైహింద్' అంటూ ఎడమచేత్తో ఆంగ్లేయాధికారు లకు సెల్యూట్ చేయడం, ఉన్నతాధికారుల ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం ఆరంభించారు. ఈ మేరకు ఫిబ్రవరి 19న సిగ్నల్‌మన్ యం.యస్ ఖాన్, టెలిగ్రాఫిస్ట్ మదన్ సింగ్ అధ్యక్ష–ఉపాధ్య క్షులుగా 'సమ్మె కమిటీ' ఏర్పడింది. ఈ కమిటీ నావికాదళ సమాచార వ్యవస్థను స్వాధీనం చేసుకుని సమ్మె సమాచారం బహుళంగా వ్యాప్తి చేయడంతో మద్రాస్, కరాచి, కొచ్చిన్, విశాఖపట్నం తదితర ప్రాంతాలలోని భారతీయ నావికులు సమ్మెలో చేరారు. ఈ సమ్మెకు సర్వామోదం పొందేందుకు నావికాదళ నావల మీద, స్థావరాల మీద భారత జాతీయ కాంగ్రెస్, అల్ ఇండియా ముస్లిం లీగ్, భారత కమ్యూనిస్టు పార్టీ జెండాలను రెపరెపలాడించారు. కానీ భారత జాతీయ కాంగ్రెస్, ముస్లిం లీగ్ సమ్మెకు మద్దతు ఇవ్వలేదు. భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతు పలకడంతో కమ్యూనిస్టు పార్టీ నాయకులు మీర్ దాద్ ఖాన్ బొంబాయి కేంద్రంగా సమ్మె కార్య క్రమాల్లో పాల్గొన్నారు. ఈ సమ్మె సందర్భంగా సర్వజన సమ్మెకు 'సమ్మె కమిటీ' పిలుపునివ్వగా ప్రజానీకం మద్దతు వెల్లువెత్తింది. ఈ సందర్భంలోనే 'రాయల్ వైమానికదళం'లో కూడా తిరుగబాటు చిహ్నాలు పొడచూపడంతో ఆగ్రహించిన ఆంగ్లేయ ప్రభుత్వం నావికాదళం తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణిచివేయమని ఆజ్ఞలు జారీ చేసింది. ప్రజల పట్ల సైన్యం, పోలీసులు కిరాతకంగా వ్యవహరించడంతో జనం తిరగబడ్డారు. ఆంగ్ల ప్రభుత్వ పోలీసులు, సైన్యం మీద ప్రజలు వీధిపోరాటాలు సాగించారు. ఈ పోరాటాల సందర్భంగా పోలీసులు, సైన్యం సాగించిన కాల్పుల సందర్భంగా ఉద్యమిస్తున్న ప్రజలకు అగ్రభాగాన నిలచిన మీర్ దాద్ ఖాన్ 1946లో అమరుడయ్యారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరిం చిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# పొదుపు చేయండి, కాని పిసినారిగా మారకండి

హిబా అర్జుమంద్



**పొదుపు అనే పదం** మనం తరచుగా వింటూ ఉంటాం.. వాడుతూ ఉంటాం.. కాని దాన్ని గురించి అంతగా ఆలోచించం. ఆదాయం పడిపోయి జేబులో డబ్బులు నిండుకున్నప్పుడు మాత్రమే 'పొదుపు', 'దుబారా' లాంటి మాటలు గుర్తుకొస్తాయి. తరువాత షరా మామూలే. నిజానికి డబ్బు అవసరం లేని వాళ్ళు భూప్రపంచంలో బహుశా ఎవరూ ఉండరు. ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరం ఉంటుంది. దాని కోసం రకరకాల మార్గాలు అన్వేషిస్తారు. ఏదో ఒక విధంగా డబ్బు సంపాదిం చాలి.. నాలుగు రాళ్ళు వెనకెయ్యాలి.. రేపటి అవసరాల కోసం దాచుకోవాలి. ఇది అందరిలో ఉండే ఆరాటమే. దీన్నే ముందు చూపు అంటారు. భవిష్యత్తు అవసరాల కోసం ప్రస్తుత ఆదాయం నుంచి కొంత భాగం ఖర్చుపెట్టకుండా దాచుకోవడాన్ని పొదుపు అంటారు. పొదుపును నిర్ణయించే ప్రధాన కారకం ఆదాయం. ఆదాయం అధికంగా ఉంటే సాధారణంగా పొదుపు కూడా అధికంగానే ఉంటుంది. కాబట్టి ఆదాయానికి, పొదుపుకు అవినా భావ సంబంధం ఉంది. తక్కువ ఆదాయం కలవారికి, వారికి లభించే కొద్దిపాటి ఆదాయం వారి అవసరాలను తీర్చుకోడానికే సరిపోతుంది. కాబట్టి అవసరాలు తీరిన తరువాత మిగిలే పొదుపు చాలా స్వల్పమే.

సాధారణ వాడుకలో పొదుపు అంటే తమ ఆదాయంలో డబ్బును ఖర్చు పెట్టకుండా అట్టిపెట్టుకోవడం. ఆర్థిక శాస్త్ర పరిభాషలో ఆదాయంలో వినియోగం పోగా మిగిలింది పొదుపు. ఇంకా సులువుగా చెప్పుకోవాలంటే ఖర్చును తగ్గించుకోవడం.. మరీ ముఖ్యంగా దుబారా ఖర్చులు. పెట్టుబడిలో నష్టాల భయం ఉంటుంది కనుక ధనాన్ని ఖర్చు పెట్టకుండా ఉంచుకోవడమే పొదుపుకు సరైన అర్థం. వ్యావహారికంగా పొదుపు ఒక విధమైన ఆలోచనా విధానం, జీవన విధానం కూడా.! అయితే, పిల్లికి కూడా బిచ్చం వేయనంత పిసినారిగా వ్యవహరించకూడదు. అసలు డబ్బు ఎందుకు అనే విషయంలో ఒక స్పష్టత ఉండాలి. జీవిత అవసరాలకా.. దుబారాలకా.. విలాసాలకా.. తమ తరు వాతి తరాలకా.. ఈ విధమైన రకరకాల కారణాలతో సంపాదన వైపు దృష్టిసారిస్తారు.. చాలామంది సంపాదించినా నిలబెట్టుకో లేరు. ఎక్కువ సంపాదించే వారైనా, తక్కువ సంపాదనా పరులైనా, కొంతమందే ఆస్తులు కూడబెట్టుకోగలుగుతారు. దీనికి కారణం, సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోవడమే. కుటుంబంలో సంపాదించేవారు ఒక్కరైనా, అందరైనా.. ఆర్థిక ప్రణాళికలో అందరి భాగస్వామ్యం ఉంటే మంచిది. కుటుంబ సభ్యులందరిలోనూ, దుబారాలు తగ్గించుకొని పొదుపు చెయ్యా లన్న కోరిక ఉండాలి. దీనికోసం ఆర్థిక ప్రణాళిక ఎలా ఉండాలో తెలిసి ఉండాలి. ప్రతి ఇంట్లో బడ్జెట్ అనేది ఉంటుంది. ఆ మాటకొస్తే ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా జమా ఖర్చుల లెక్క ఉండాలి. వ్యక్తిగత ఖర్చులు, ఇంటి ఖర్చులు, పిల్లల పాకెట్ మనీ ఇలా రకరకాల ఖర్చులుంటాయి. అయితే కుటుంబ సభ్యు లందరూ ఎవరికి కేటాయించిన బడ్జెట్‌లో వాళ్లు ఖర్చులు పెట్టు కొని, ప్రతి ఒక్కరూ అందులోంచే పొదుపు చేయాలి. చాలా మంది పిల్లలకు పాకెట్ మనీ ఇస్తారు. కాని ఎలా ఖర్చుపెట్టాలో..

దేనికోసం ఖర్చుపెట్టాలో వారికి తెలియదు. అందుకని వారికి పొదుపు పాఠాలు నేర్పాలి. పాకెట్ మనీ మొత్తం ఖర్చు చేయ కుండా ఎలా ఆదా చేయాలో వారికి అవగాహన కల్పించాలి. తద్వారా కొంత దాచుకోవడం అలవాటు అవుతుంది. అలాఅని వారిని పిసినారులుగా తయారు చేయకూడదు. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇలా చిన్నప్పుడే నేర్పిన పొదుపు పాఠాలు.. వారికి భావి జీవితంలో ఎంతగానో ఉపయోపడతాయి. చాలా మంది తల్లిదండ్రులు తమ ఆర్థిక లావాదేవీల గురించి పిల్లలకు చెప్పరు. వారి ఆదాయం, ఖర్చులు, అప్పులు, పొదుపు, బరువు బాధ్యతలు పిల్లలకు తెలియాలి. ప్రతీ నెల కుంటుంబానికి అయ్యే ఖర్చుగురించి, అంటే నెలవారీ ఇంటి బడ్జెట్ గురించి వారితో చర్చిస్తే మంచిది. ఇంటి జమా ఖర్చుల విషయంలో వారి సలహాలు తీసుకుంటే ఇంకా మంచిది. దీనివల్ల వారికీ బాధ్యతలు తెలుస్తాయి. బడ్జెట్ రూప కల్పనలో వారి సలహాలు ఉపయుక్తంగా ఉండే అవకాశమూ ఉంది. మరో విషయం ఏమిటంటే, ఇప్పుడు అన్ని రకాల నిత్యావసర వస్తువులూ ఇంటిముందుకే వస్తున్నాయి కదా అని, అవసరమైనవీ, అవసరం లేనివీ పది రకాల వస్తువులు కొనేయకూడదు. అవసరమైనవి మాత్రమే, అవికూడా ఎక్కువ తక్కువ కాకుండా సరిపడినంత వరకు మాత్రమే ఖరీదు చెయ్యాలి, ఏరోజుకారోజు మారుతున్న ధరలు, నాణ్యత విషయంలో అవగాహన ఉండాలి. కొన్ని రకాల వస్తువులు ఆన్‌లైన్‌లో దొరుకుతాయి. కొన్ని కొన్ని వస్తువులు బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకు లభిస్తాయి. మరికొన్ని మార్కెట్ ధరతో బేరీజు వేసుకొని, నాణ్యత పరిశీలించుకొని కొనుగోలు చేయవచ్చు. దీనివల్ల ఎంతోకొంత పెట్రోలు, ఆటో చార్జీలకయ్యే ఖర్చు పొదుపవుతుంది. సమయమూ వృధాకాదు. కూర్చున్న చోటుకే మనకు కావలసిన వస్తువులు వచ్చేస్తాయి. ఆన్ లైన్ లో ప్రత్యేక ఆఫర్లు, పండుగ రాయితీలు ఉంటాయి. వాటిని కూడా వినియోగించుకుంటే ఎంతోకొంత ఆదా చేయ వచ్చు. అలాఅని ఆన్‌లైన్ మీదనే ఆధారపడితే ఖాతాలో డబ్బు లన్నీ ఖాళీ అయిపోతాయి. ఏ విషయంలో అయినా అతి పనికి రాదు. ఇక్కడ కూడా అదే సూత్రం వర్తిస్తుంది. కొంతమంది ఆదివారాలు చాలా డబ్బులు దుబారా చేస్తుంటారు. కుటుంబ మంతా కలిసి బయటికెళితే చాలా ఖర్చవుతుంది. సినిమాలు, షికార్లు, హోటల్ భోజనం తడిసి మోపెడవుతుంది. వినోదం మిస్ కాకుండానే, ఈ అనవసరపు ఖర్చును పొదుపు చేయాలంటే దానికోసం ఇంటినే వేదికగా మలచుకొనే ఉపాయం ఆలోచిం చాలి. కుటుంబ సభ్యులందరూ కలసి చూడగలిగే సినిమాలు ఏమైనా ఉంటే గింటే గనక ఇంట్లోనే చూసే ప్రయత్నం చెయ్యాలి. ఏవిధంగానూ సభ్యతకు, విలువలకు భంగం కలిగించని షార్ట్ ఫిల్ములు, గేమ్స్ ప్లాన్ చేసుకోవాలి. వ్యక్తిత్వ వికాసానికీ, నైతిక విలువలకు సంబంధించిన, విజ్ఞానం, వినోదం కలగలిసిన కార్యక్రమాలు రూపొందించుకోవాలి. అందరూ కలసి దగ్గరలోని పార్కుకో, పచ్చిక బయలు వైపో నడుచుకుంటూ వెళ్ళి చల్లని సాయంత్రాన్ని ఎంజాయ్ చెయ్యవచ్చు. ఒకవేళ ఆ పూటకు ఇంట్లో వంట చేయకపోయినా, నచ్చిన ఆహారం పార్శిల్ ఇంటికే తెప్పించుకోవచ్చు. ఇలా చేయడంవల్ల ఖర్చు సగానికి సగం ఖచ్చితంగా తగ్గిపోతుంది. ఆరోగ్యానికీ మంచిది. ఇంట్లో అందరూ కలిసి మెలసి ఆనందంగా సమయం గడిపినట్టు కూడా ఉంటుంది. అలాగే పొదుపుకు సంబంధించి పాటించవలసిన అంశాలు ఇంకా అనేకం ఉన్నాయి. ఉదాహరణకు, బట్టల విషయంలో .. అవసరమున్నా, లేకపోయినా చాలామంది ఏదో సందర్భం సాకుతో కొత్తబట్టలు కొంటూ ఉంటారు. విద్యుత్తు విషయంలో కూడా పొదుపు పాటించరు. ఫ్యాన్లు తిరుగుతునే ఉంటాయి.. లైట్లు వెలుగుతూనే ఉంటాయి.. నీటినీ వృధా చేస్తారు.. మొబైల్ చార్జీలు కూడా అంతే.. అలాగే, ప్రతి చిన్న పనికీ వాహనాలు వినియోగిస్తుంటారు. నాలుగడుగులు వెళ్ళాలంటే బైక్ తియ్యాల్సిందే.. సైకిలు ఎప్పుడో మూలన పడింది. నిజానికి లోకల్ పనులకు సైకిల్ వినియోగించవచ్చు. దీనివల్ల పెట్రోలూ ఆదా అవుతుంది. ఆరోగ్యానికీ మంచిది.. అసలు అదీ ఇదీ అని కాకుండా జీవనరంగం లోని అన్ని విషయాల్లోనూ పొదుపు పాటించడం అవసరం. పెట్టుబడి లేదుకదా అని నోటినీ గాలికి వదలకూడదు. ఆచి తూచి పొదు పుగా మాట్లాడాలి. ఈ పొదుపు సూత్రాలు పాటించడం మాటలు చెప్పుకున్నంత సులువేంకాదు. కానీ ప్రయత్నిస్తే కష్ట సాధ్యమూ కాదు. మొదలు పెట్టిన కొద్ది రోజుల్లోనే ఫలితాలు రావాలని ఆశించడం కూడా సరి కాదు. ఒక పద్ధతి ప్రకారం ఆర్థిక ప్రణాళిక అమలు చేసుకుంటూ పోతే, కొన్ని నెలల తర్వాత కుటుంబ నిర్వహణకు సంబంధించిన జమా ఖర్చుల లెక్క (ఇంటి బడ్జెట్‌ని) చక్కగా ప్లాన్ చేసుకునే నైపుణ్యం అర్థమవుతుంది. తద్వారా మనకు తెలియకుండానే పొదుపు పెరుగుతుంది. అలా పొదుపయిన ప్రతీ రూపాయి అదనపు ఆదాయం కిందే లెక్క. అయితే పొదుపు వ్యామోహంలో పడి మరీ పిసినారులుగా మారకూడదు. కుటుంబానికీ, బంధువులకూ, పేదసాదలకూ సంపాదనలో ఎంతోకొంత వాటా కల్పించాలి. సత్కార్యాలకూ సంపాదన వెచ్చించాలి. పొదుపు అంటే, నోరూ, చేతులు కట్టేసు కోవడం కాదు. ఆదాయ, వ్యయాలను బేరీజు వేసుకొని ఉన్నంతలో సంతృప్తిగా జీవించడం. మధ్యేమార్గాన్ని అవలం బిస్తూ, దైవం ప్రసాదించిన సంపదను సరైన విధంగా సద్విని యోగం చేసుకుంటే ఆత్మసంతృప్తి లభిస్తుంది. సమాజమూ హర్షి స్తుంది. దేవుడూ మెచ్చుకుంటాడు. ఏమంటారు.? ✤

# అమెరికా ఎన్నికల్లో ముస్లింల మొగ్గు ఎటువైపు?




ముహమ్మద్ ముజాహిద్

**అగ్ర రాజ్యం** అమెరికాలో నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికలపై ప్రపంచమంతటా ఆసక్తి నెలకొంది. ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు తప్పదని తేలడంతో అన్ని వర్గాల ఓట్లు విలువైనవిగా మారాయి. దీంతో యూఎస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకోవడంలో ముస్లింల ఓట్లూ కీలకంగా మారాయి. అమెరికా మొత్తం ఓటర్లలో భారతీయ అమెరికన్ల ఓట్లు దాదాపు 26లక్షలు ఉండగా, అందులో రెండున్నర లక్షల ముస్లిమ్ ఓట్లున్నాయి. సంఖ్యా పరంగా చూస్తే తక్కువే అయినా వీరి ప్రభావం నానాటికీ పెరుగుతుండడంతో వీరిపై ప్రధాన పార్టీలైన డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. రాజకీయ నేతలుగానూ కొందరు ముస్లిములు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముస్లింల ఓట్లను దక్కించుకునేందుకు పార్టీలు ప్రత్యేక ప్రణాళికలు రచించాయి. అయితే అమెరికా ముస్లిం ఓటర్లు ఈసారి ఎవరికి ఓటు వేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

యూఎస్ జనాభాలో ఒక శాతం ఉన్న ముస్లిములు మిషిగన్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నారు. అమెరికాలోని ముస్లిం ఓటర్లు గాజా యుద్ధం గురించి ఎక్కువగా చర్చించుకుంటున్నారు. ఇస్రాయీల్‌కు మద్దతుగా నిలుస్తున్న బైడెన్-హారిస్ విధానాల కారణంగా గాజాలో యుద్ధం జరుగుతుండటం వల్ల వారి పాలనపై అమెరికన్ ముస్లింలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పాలస్తీనియన్ల దుస్థితికి డెమొక్రాట్లను తప్పు పడుతున్నారు. అయితే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్ల కూడా వారు ఏమంత సంతృప్తిగా లేరు. ఆయన హయాంలో ఏర్పడిన 'పలు ముస్లిం దేశాల నిషేధం', ఇస్లామోఫోబియా భావనలను వారు మరచి పోలేదు. ఈ నేపథ్యంలో అమెరికన్ ముస్లింలు ఎవరివైపు మొగ్గు చూపుతారనే ఫలితాల తర్వాతే తెలియనుంది.

రాజకీయ విశ్లేషణలను పరిశీలిస్తే.. ఈ సారి దాదాపు 29.4 శాతం మంది ముస్లింలు కమలా హారిస్‌కు ఓటేయొచ్చని అంచనా. గాజాలో ఇజ్రాయెల్ దురాగతాలకు మద్దతు ఇచ్చినందుకు డెమొక్రాట్లకు తగిన బుద్ధి చెప్పాలని కొందరు ముస్లిం ఓటర్లు భావిస్తుండటమే ఇందుకు కారణ మని చెప్తున్నారు. పాలస్తీనా హక్కులను రక్షించే వారికి, అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే వారికే ఈసారి మద్దతు పలకాలని వారు నిర్ణయించు కున్నారు. ఈ పరిస్థితుల్లో గతంలో డెమోక్రాట్లకు మద్దతిచ్చిన ముస్లింలు ఈసారి ట్రంప్‌కు కొంత అనుకూలంగా ఓటేస్తారా?

## మూడో అతిపెద్ద మతం

అమెరికాలో మూడో అతిపెద్ద మతం ఇస్లాం. అక్కడ మొత్తం 4.45 మిలియన్ల ముస్లిం జనాభా ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ పాలసీ అండ్ అండర్‌స్టాండింగ్ (ISPU) సర్వే ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లోని ముస్లింలు మైనారిటీలు అయినప్పటికీ, సామాజికంగా ప్రముఖ స్థానంలో ఉన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చిన్న వ్యాపారాల అభివృద్ధికి ముస్లింలు గణనీయమైన కృషి చేశారు. అమెరికాలో దాదాపు 8% మంది ముస్లింలు స్వంత



వ్యాపారాన్ని కలిగి ఉన్నారు. వారు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ముస్లింలకు చెందిన వ్యాపారాల సంఖ్య న్యూయార్క్ నగరంలో 96 వేలకు, మిషిగన్ రాష్ట్రంలో 36 వేలకు చేరుకుంది. అమెరికన్ ముస్లిం యాజమాన్యంలోని వ్యాపారాలు ప్రధానంగా న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్, ఫ్లోరిడా, మిషిగన్ రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉన్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. ముస్లిం వ్యాపారులు తమ ఉత్పత్తులతో దేశీయ, ప్రపంచ "హలాల్" ఆర్థిక వ్యవస్థకు సేవలందిస్తున్నారు. ఈ ఉత్పత్తులలో హలాల్ ఆహారం, నిరాడంబరమైన ఫ్యాషన్ వస్తువులు, మీడియా, వినోదం, హలాల్ ఫార్మాస్యూటికల్స్, ముస్లిం-ఫ్రెండ్లీ టూరిజం, హలాల్ కాస్మొటిక్స్, ఇస్లామిక్ ఫైనాన్స్ ఉన్నాయి. ముస్లిం అమెరికన్ల యాజమాన్యంలోని ప్రముఖ వ్యాపారాలలో ముజ్ (ముస్లిం మ్యాచ్ మేకింగ్ యాప్), లాంచ్‌గూడ్ (ముస్లిం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోసం క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫారమ్), స్వాష్ గేర్ (ముస్లిం మహిళలకు నిరాడంబరమైన వాటర్‌స్పోర్ట్స్ గేర్‌ను అందించే ఒక దుస్తులు కంపెనీ) ఉన్నాయి.

# స్వర్గవాసి

మట్టి లోనే పుట్టాను
మట్టి లోకే పోతాను
అయితే
ఈ నేల మట్టి నాకు అపరిచితం
నేను పరదేశీని!

ఈ లోకంలోని భూమి కాదు...
నా స్వస్థలం...
ప్రభువు పంపగా వచ్చాను
మట్టి నేల పైకి!
పరలోకంలోని స్వర్గం
నా జన్మ భూమి!!

ఇక
ఈ లోకమంతా నాదే-
అయినా
సకల భువనంలో
ఏ మట్టి ముక్కకూ చెందను

ఈ భువన భాండవాలు
పగటి వేలుపు. నెలరేడు
సహస్రకోటి కాంతిపుంజాలు
గోళాలు మండలాలు
జగతిలోని జీవరాశులు
సర్వం నా కొరకే!
నా సేవ కొరకే!!

నేను స్వర్గవాసిని
స్వర్గమే నా గమ్యం
స్వర్గమే నా సర్వం!
స్వర్గానికే నా పయనం!!

**- మలిక్**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

7 – 9 ఆకాశాలు, భూమికీ ప్రభువు, ఆకాశాలూ భూమికీ మధ్యనున్న ప్రతిదానికీ ప్రభువు, మీరు నిజంగానే నమ్మకం గలవారయితే. మరే ఆరాధ్యుడూ లేడు ఆయన తప్ప. ఆయనే జీవితాన్నీ ప్రసాదిస్తాడు, మరాయనే మృత్యువునీ ఇస్తాడు; మీకూ ప్రభువే, లోగడ గతించిన మీ పూర్వీకులకూ ప్రభువే.[9] (కాని వాస్తవంగా ఈ జనానికి నమ్మకం లేదు) నిజానికి వీరు ఆశంకలో పడి ఆటాడుకుంటున్నారు.[10]

9. ఇందులో ఒక సూక్ష్మమయిన సంకేతముంది, మీ పూర్వీకులు ఎవరయితే ఆయన్ని కాదని ఇతర ఆరాధ్యుల్ని రూపొందించుకున్నారో వారి ప్రభువు కూడా వాస్తవానికి ఆయనే. వారు తమ నిజ ప్రభువును కాదని ఇతరుల ఆరాధన చేసి సరయిన ఆచరణ చెయ్యలేదు – మీరు వారి అనుసరణను పాటించడం ద్వారా చేస్తున్నది సరయినదే అనడానికి, వారి ఈ చర్యను, మీ మతం సరయినదనడానికి ఆధారంగా పరిగణించడానికి. వారు కేవలం ఆయన దాస్యమే చెయ్యడం వారి తప్పనిసరి బాధ్యత, ఎందుకంటే ఆయనే వారి ప్రభువు. కాని వారు అలా చెయ్యలేదు, అయితే మీరు మాత్రం తప్పనిసరిగా అన్నింటి ఆరాధన వదలి కేవలం ఆయన ఒక్కని దాస్యమే చెయ్యాలి, ఎందుకంటే ఆయనే మీ ప్రభువు గనక.

10. ఈ క్లుప్తమయిన వాక్యంలో ఒక మహత్పూర్వకమయిన యదార్థాన్ని సూచించడం జరిగింది. నాస్తికులయినా, బహుదైవారాధకులయినా వీరందరికీ అప్పుడప్పుడు ప్రత్యేకమయిన ఘడియలు ఆసన్నమవుతూ ఉంటాయి. అప్పుడు వారి ఆంతర్యం లోపలి నుంచి మొరపెట్టుకుంటుంది, నీవనుకుని కూర్చున్న దానిలో ఎక్కడో ఒకచోట పట్టు లేదు అని. నాస్తికుడు తన దైవ తిరస్కారంలో ఎంత తీవ్రవాది అయినప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు అతని ఆంతర్యం సాక్ష్యం పలికితీరుతుంది– మట్టి రేణువు మొదలుకుని పాలపుంతల వరకు, గడ్డిపోచ మొదలుకుని మానవుని వరకు గల సృష్టి ఆశ్చర్యజనకమయిన, విజ్ఞతా భరితమయిన వ్యవస్థ ఒక వివేచనాశీలుడయిన కర్త లేనిదే ఉనికిలోకి రాజాలదు అని. అలాగే, ఒక బహుదైవారాధకుడు తన బహుదైవారాధనలో ఎంతటి మొండిపట్టు గలవాడయినా ఎప్పుడో ఒకప్పుడు అతని మనస్సు కూడా ఘోషిస్తుంది, నేను ఆరాధ్యులుగా చేసి కూర్చున్నవన్నీ ఆరాధ్యులు కాలేవు అని. కాని ఆంతర్యం పలికే సాక్ష్యం ఫలితంగా వారికి దైవం ఉనికి, ఆయన ఏకత్వం పట్ల దృఢ విశ్వాసమూ ప్రాప్తం కాదు. లేదా వారికి వారి నాస్తికత్వం, బహుదైవారాధనా భావంలో పూర్తిగా నమ్మకమూ, తృప్తీ కలగవు. దీనికి బదులు వారి ధర్మం వాస్తవానికి శంక ఆధారంగా ఏర్పడుతుంది – అందులో వారు ఎంతగా దృఢ విశ్వాసాన్ని వ్యక్తం చేసినా. ఈ ఆశంక వారిలో అసహనాన్ని, వ్యాకులతను ఎందుకు సృజించదు అన్న ప్రశ్న తలెత్తుతుంది. వారు గంభీరంగా సత్యాన్వేషణ ఎందుకు చెయ్యరు, తద్వారా విశ్వాసపు తృప్తిని పొందే ప్రయత్నం ఎందుకు చెయ్యరు అన్నదే ప్రశ్న. యదార్థం ఏమిటంటే, ధర్మం విషయంలో గాంభీర్యం వారికి ఎన్నడూ దరిచేరదు. వారి దృష్టిలో అసలు ప్రాముఖ్యత ప్రపంచ సంపాదన, దాని సౌలభ్యాలు, సౌఖ్యాలకే ఉంటుంది. దాని చింతలోనే వారు తమ శరీరం, మనోమస్తిష్కాల సమస్త శక్తులు ధారబోస్తారు. పోతే, ధార్మిక విషయాల మాటకు వస్తే వాస్తవానికి అది వారికి ఒక ఆట, కాలక్షేపం, మానసిక విలాసం తప్ప మరేమీ కావు. వారు వాటి విషయంలో గంభీరంగా కొన్ని క్షణాలు సయితం ఆలోచన చింతనలో గడపలేరు. మతపరమయిన ఆచారాలయితే ఏదో కాలక్షేపంగా పాటిస్తారు. తిరస్కారం, నాస్తికత్వం ఇత్యాది వాదనల్ని, చర్చల్ని కేవలం కాలక్షేపంగానే చేస్తారు. ప్రపంచ వ్యవహారాలలో మునిగిన వారికి అంతగా తీరిక ఎక్కడుందనీ, తాము సత్యానికి దూరంగా నయితే లేముకదా అనీ, ఇంకా సత్యానికి దూరమే అయినట్లయితే దాని పరిణామ ఫలం ఏమవుతుందని కూర్చుని ఆలోచించడానికి?

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## హుదైబియా విశేషాలు

**57)** తారిఖ్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఇలా వివరించారు: నేను హజ్జ్ చేసే ఉద్దేశ్యంతో వెళుతూ దారిలో ఒకచోట కొంతమంది నమాజ్ చేయటం చూశాను. 'ఇది ఏ మస్జిద్?' అని వారిని అడిగితే, 'ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఏ వృక్షం క్రింద విధేయతా ప్రతిజ్ఞ (బైఅతె రిజ్వాన్) చేయించారో ఆ వృక్షం యిది' అని వారు చెప్పారు. తరువాత నేను సయీద్ బిన్ ముసయ్యిబ్ దగ్గరకు వచ్చి, ఈ సంగతి తెలియపరచగా, ఆయన ఇలా అన్నారు: 'నా తండ్రి ముసయ్యిబ్ బిన్ హిజ్న్ నాతో ఇలా అన్నారు– ఆ స్థలం క్రింద దైవప్రవక్త(స) సమక్షంలో బైఅత్ చేసిన వారిలో ఆయన ఒకరు– (ఆయన ఇలా అనేవారు) 'మరుసటి సంవత్సరం నేను అక్కడికి వెళ్ళినప్పుడు ఆ వృక్షం ఉన్న స్థలాన్ని మరిచిపోయాను'. సయీద్ ఇలా అన్నారు: 'మహా ప్రవక్త(స) ప్రియ సహచరులు సయితం ఆ వృక్షాన్ని గుర్తుపట్టలేకపోయారు. మరలాంటప్పుడు ఆ స్థలాన్ని మీరెలా గుర్తు పట్ట గలిగారు? అంటే మీరు వారికన్నా ఎక్కువ జ్ఞాన సంపన్నులయ్యారా?"[1]

**70)** జైద్ బిన్ అస్లమ్ తెలియజేశారు: ఆయన తండ్రి అస్లమ్ ఒకానొక ప్రయాణం (హుదైబియా ప్రయాణం)లో ప్రవక్త మహనీయుల (సఅసమ్) వెంట ఉన్నారు. రాత్రి సమయం. ఆ సమయంలో ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) దైవ ప్రవక్త(స)ను వెన్నంటి ఉన్నారు. ఉమర్ ఆయన(స)కు ఏదో అడిగారు. కాని ఆయన (స) సమాధానం ఇవ్వలేదు (ఎందుకంటే ఆ సమయంలో దైవ ప్రవక్తపై దైవవాణి అవతరిస్తూ ఉంది. ఆ సంగతి ఉమర్‌కు తెలీదు). ఉమర్ మళ్ళీ అడిగారు. ఈ సారి కూడా జవాబు రాలేదు. ఆయన మళ్ళీ ప్రశ్నించగా మూడవ సారి కూడా దైవప్రవక్త(స) నుండి సమాధానం రాలేదు.

అప్పుడు ఉమర్ (తన మనసులో) ఇలా అనుకున్నారు: 'ఉమర్! నీ తల్లి నీ పరిస్థితిపై ఏడ్వ. దైవప్రవక్త(స)ను నీవు మూడు సార్లు ప్రశ్నించావు. ఒక్కసారి కూడా నీకు జవాబు ఇవ్వలేదు'. తరువాత ఉమర్ (రజి) తన ఒంటెను వేగంగా తోలుకుని, ముస్లింలందరికన్నా ముందుకు వెళ్ళిపోయారు. తన గురించి దైవాజ్ఞ ఏదయినా అవతరిస్తుందేమోనని ఉమర్ భయపడిపోయారు. కొన్ని క్షణాల తర్వాత ఒక వ్యక్తి నా పేరు పెట్టి పిలవటం నేను విన్నాను.


ఆయన(రజి) ఇలా అన్నారు: నేను ముందు నుంచే భయాందోళనకు గురై ఉన్నాను. నా ప్రవర్తనపై ఎక్కడ వహీ అవతరించిందోనని నేను వణికిపోయాను. తరువాత నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై సలామ్ చేశాను. ఆయన(స) ఇలా అన్నారు : "రాత్రి నాపైన ఒక సూరా అవతరించింది. సూర్యుడు ఎక్కడెక్కడి వరకు ఉదయిస్తాడో ఆ జగమంతటికన్నా నాకు ఈ సూరా ప్రియమైనది"– ఆ తరువాత ఆయన(స), 'ఇన్నాఫతహ్‌నా లక ఫతహమ్ముబీనా' (ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము) అనే వాక్యాన్ని పారాయణం చేశారు.[1]

57-1. ప్రవక్త ప్రియ సహచరులు తెలుసుకోలేకపోయిన దానిని మీరెలా కనుగొన్నారు? అని సయీద్ బిన్ ముసయ్యిబ్ ప్రశ్నించటం గమనార్హ విషయం. ఇబ్నె సయీద్ గారు నాఫె నుండి ప్రామాణికంగా ఉటంకించిన దాని ప్రకారం; కొంతమంది ఆ వృక్షం వద్దకు వచ్చి, అక్కడ నమాజ్ చేస్తున్నారని హజ్రత్ ఉమర్ (రజి)కు సమాచారం అందినప్పుడు, ఆ వృక్షాన్ని నరికివేయమని ఆయన ఆజ్ఞాపించారు. ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే; ప్రజలు ఏ వస్తువును పూజించే ప్రమాదం పొంచి ఉన్నదో, ఎక్కడ షిర్క్ జరిగే అవకాశం ఉందో, దానిని రూపు మాపటం సమంజసమే.

70-1. దైవప్రవక్త(స)పై అల్ ఫత్హ్ సూరా అవతరిస్తున్న సంగతి ఉమర్ (రజి)కు తెలీదు. తెలిస్తే మూడుసార్లు ప్రశ్నించేవారు కారు. తన ప్రశ్నకు దైవప్రవక్త(స) నుండి సమాధానం రాకపోవటంతో ఆయన లోలోపలే భయపడిపోవటం గమనార్హం. అల్ ఫత్హ్ సూరాలో ఇటు దైవప్రవక్త (స)కు, అటు ముస్లింలకు కూడా శుభవార్త వినిపించబడింది.

నసీరా బేగం





# వీటిపై అదుపును సాధించండి

**మనిషి**లో ఉండే అనైతిక అలవాట్లను గురించి చెప్పుకుంటూ పోతే ఒక పెద్ద పట్టిక తయారవుతుంది. వాటిలో కొన్ని మౌలికమైనవిగా ఉంటాయి. మనిషి గనక వాటి నుండి దూరంగా ఉన్నట్లయితే దాదాపుగా అన్ని అనైతిక ద్వారాలను మూసివేయవచ్చు. వాటిలో కొన్ని ఇవి :

**గర్వం :** గర్వం అంటే మనిషి తనను తాను గొప్పవానిగా, మంచివానిగా భావించటం. సాధారణంగా ప్రతి మనిషి తనలో గర్వం ఉండదు అని భావిస్తాడు. గర్వం అనేది పెద్ద ధనవంతుల్లోనో లేదా అధిక జ్ఞానం కలవారిలో ఉంటుందని భావిస్తారు. కాని ఈ వ్యాధి సాధారణమైనది. అది ఒక బీదవానిలోనూ ఉండవచ్చు. ఒక ధనవంతునిలో కూడానూ ఉండవచ్చు. దైవభీతి పరులలోనూ ఉండవచ్చు. ఇమామ్ గజాలి (ర) ఇలా అన్నారు : 'నేను ఒక ధర్మజ్ఞానిలో ఉన్నంత గర్వం ఒక సాధారణమైన వ్యక్తిలో చూడలేదు.'

గర్వం ఎన్నో చెడులకు మూలం. అల్లాహ్ షైతాన్‌ను హజ్రత్ ఆదమ్(అ) ముందు సాష్టాంగపడమని ఆజ్ఞాపించినప్పుడు అతడు అల్లాహ్ ఆజ్ఞను ధిక్కరించాడు. అల్లాహ్ అతడిని 'ఓ ఇబ్లీస్! నీకు ఏ కారణం  ఆదమ్(అ)కు సాష్టాంగపడేందుకు ఆపింది' అని అడిగినప్పుడు అతను ఇలా సమాధానం పలికాడు : నేను అతడి కంటే శ్రేష్టుణ్ణి. మీరు నన్ను అగ్నితో పుట్టించారు. ఇతన్నేమో మట్టితో సృష్టించారు (38: 76). దీని ద్వారా తెలిసిన విషయమేమిటంటే షైతాన్ గర్వంలో కూరుకుపోయాడు. దానిద్వారా ఇది దైవాజ్ఞ అని కూడా మరిచిపోయాడు. దైవాజ్ఞను ధిక్కరించడం తనకు ఎంత నష్టదాయకమో ఆలోచించలేదు. ఇంకా ఆ గర్వం అతణ్ణి పశ్చాత్తాపం చెందనివ్వలేదు. పైగా ఆ గర్వం అల్లాహ్‌కే షరతు పెట్టేలా అతడిని ఉసికొలిపింది. చివరకు అతడి ఇహలోక జీవితాన్ని, పరలోక జీవితాన్ని రెండింటినీ నాశనం చేసింది.

మనిషి తనను తాను గొప్పవానిగా భావించటం, ఇతరులు తనను గొప్పవానిగా భావించి గౌరవించాలనుకోవడం కూడా గర్వమే. గర్వపడే మనిషి తన లోపాలు తాను గ్రహించినప్పటికీ ఇతరులు తమ లోపాలను బహిర్గతం చెయ్యకుండా ఉండాలని భావిస్తాడు. ఎవడైనా అతన్ని సంస్కరించే ఉద్దేశ్యంతో అతని లోపాలను గుర్తించి అతని ముందు సదుద్దేశ్యంతో ప్రస్తావించినప్పుడు అతను ఆ సంస్కర్తపైనే మండిపడతాడు. అతన్ని చిన్నచూపు చూస్తాడు. అతన్ని నలుగురిలో హేళన చేస్తాడు. దాని కారణంగా చివరకు ఆ గర్విష్టి మార్గదర్శక దారులన్నీ మూసుకుపోతాయి.

ఇలాంటి దారి తప్పిన గర్విష్టులు అన్ని కాలాల్లోనూ మనకు కనిపిస్తారు. ప్రతి చోట, ప్రతి కాలంలో వచ్చిన ప్రవక్తలందరికీ ఇలాంటి గర్విష్టులు తారసపడతారు. 'ప్రవక్తగా చేసి పంపించటానికి అల్లాహ్‌కు నీవే దొరికావా? నీకంటే ఉత్తములు ఎవరూ లభించలేదా?' అని వారు హేళన చేశారు. వారు పలికిన ఈ హేళన పలుకులను అల్లాహ్ ఖుర్ఆన్ వాక్యాల ద్వారా ఇలా తెలియజేశాడు: మన మధ్య కేవలం అతను ఒక్కడిపైనైనా దేవుని ప్రస్తావన అవతరింపజేయబడింది (54: 25). ఈ విధంగా వారు సంస్కర్తగా వచ్చిన దైవప్రవక్తలనే ధిక్కరించారు. మనిషి గనక తనను తాను సంస్కరించాలనుకుంటే అతనిలో మృదుత్వం, భయభక్తులు అనే సుగుణాలు ఉండాలి. గర్విష్ఠిలో ఇలాంటి

సుగుణాలు ఉండవు. కనుకనే అతను సంస్కర్తలను ధిక్కరిస్తాడు. ఇహలోకంలో అగౌరవం పాలవుతాడు. పరలోకంలో నరకం పాలవుతాడు.

**అసూయ :** అసూయ కూడా గర్వానికి తోబుట్టువే. గర్వం ఉన్న మనిషి నాకంటే అధికంగా ఎవరూ ఉండకూడదని భావిస్తాడు. అన్నీ తనకే లభించాలని కోరుతాడు. ఎవరి వద్దనైనా ఏదైనా మంచి వస్తువు ఉంటే దానిని ఎంత మాత్రం సహించడు. ఒకవేళ అది తనకు లభించకపోయినా ఎదుటివారి నుంచి అది నశించిపోవాలని భావిస్తాడు. ఈ అసూయ మనిషికి నిద్రాహారాలు మాన్పించి వేసే ఒక పెద్ద రోగం. అతని మతి కూడా సరిగ్గా పని చెయ్యకుండా చేసే ఒక మానసిక రోగం. ప్రతీకార జ్వాలలో రగిలించి వేసే ఒక భయంకరమైన రోగం.

ఈ అసూయాపరుడికి ఒకింత జ్ఞానం కూడా ఉండదు. అతనికి ఉండే కొంత జ్ఞానంపై కూడా అసూయపు పరదా కప్పబడి ఉంటుంది. దేవుడు ఈ భూమి మీద మనిషిని పుట్టించి అతనికి కావలసిన కనీస అవసరాలన్నీ దాదాపు అందరికీ సమానంగానే ఇస్తాడు. కాని కొన్ని అనుగ్రహాలు కొందరికి ఎక్కువగానూ, కొందరికి తక్కువగాను ప్రసాదిస్తాడు. అలా ఉండటం ఈ ప్రపంచానికి అవసరం కూడాను. అది దైవ వివేకం. మనిషికి అందులో పరీక్ష కూడా ఉంది. ఆ పరీక్షకు ప్రతిఫలం కూడా లభించనుంది.

ప్రతి మనిషికి కోరికలు తప్పకుండా ఉంటాయి. ఆ కోరికలు గొంతెమ్మ కోరికలు కాకూడదు. చూసిన ప్రతీది తనకు దక్కాలని కోరుతూ ఇతరుల వద్ద ఉన్నది ప్రతీది తనకు లభించాలని కోరుతూ తనకు లేకుండా అవి ఇతరులకు ఎందుకు లభించాయని భావిస్తూ దురాశల కోటలు కట్టుకుంటూ పోయినప్పుడే అసూయ అనే రోగం మెల్లిమెల్లిగా పుట్టుకొస్తుంది. అది క్రమక్రమంగా అతనిలో ఉన్న కొద్దో గొప్పో సత్కార్యాలను దహించి బూడిద చేసేస్తుంది. అతను కొంతైనా ఆలోచించలేడు. ఒకవేళ అసూయాపరుడు కోరినట్లుగా అన్నీ అతనికే ప్రసాదించి నట్లయితే అతను వాటిని మోయగలడా? అతనికి ఊపిరి ఆడుతుందా? అలా గనక ఇవ్వబడినట్లయితే అతను పిచ్చివాడై పోవటం ఖాయం కాదా!


అల్లాహ్ తనకు ఏదైతే ప్రసాదించాడో వాటిని కృతజ్ఞతా పూర్వకంగా స్వీకరించాలి. ఏవైతే ప్రసాదించలేదో వాటిపై సహనం వహించాలి. ఏవైతే ఇంకా అవసరాలుగా మిగిలిపోయాయో వాటిని ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకోవాలి. దాని కోసం మానవతా కృషి కూడా చెయ్యాలి. అంతా చేసినప్పటికీ లభించక పోయినట్లయితే అది తన మంచి కోసమే అని భావించి తృప్తి పడాలి. ఇతరుల వద్ద ఉన్న అనుగ్రహాలను చూసి వారి పట్ల సంతోషాన్ని వ్యక్తపరచాలి. ఇంకా తన మనసును నిర్మలమైనదిగా ఉంచుకోవాలి. అసూయా ద్వేషాలు లేకుండా స్వచ్ఛమైన, పరిశు భ్రమైన మనస్సు కలవారిని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడని శుభవార్త కూడా తెలుపబడింది.

**కోపం, ఆగ్రహం :** ఇది కూడా చెడులన్నింటికీ మూలం. ఆగ్రహ జ్వాలలు అతివేగంగా రగులుతాయి. అంతే వేగంగా కొన్ని వాటిని కాల్చి బూడిద చేసివేస్తాయి. మనిషికి కోపం వచ్చినప్పుడు అతని శరీరం అతని అధీనంలో ఉండదు. ముఖం ఎర్రగా అగ్నిలా దహిస్తూ ఉంటుంది. అతని నరాలు ఉబ్బిపోతాయి. నోటి నుంచి నురగలు వస్తూ ఉంటాయి. రక్తపోటు అధికంగా పెరిగిపోతుంది. దాని ప్రభావం అతని మాటలపై, అతని హృదయంపై, అతని కార్యాలపై పడుతుంది. దేనిపైనా అతనికి అదుపు ఉండదు. ఇష్టా రాజ్యంగా ప్రవర్తిస్తాడు. చివరకు దాని పర్యవసానం చాలా ఘోరమైనదిగా ఉంటుంది. కాని ఈ ఆగ్రహం కొంత సమయమే ఉంటుంది. పాలు పొంగినంత కాలమే. ఆ తరువాత దాదాపుగా తగ్గిపోతుంది. కాని అంత సమయంలోనే జరగరాని నష్టం జరిగిపోయి ఉంటుంది. ఆ తరువాత అతను చల్లబడినప్పుడు అంతా చూసుకుని తల పట్టుకుని కూర్చుంటాడు. ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితిలోకి వెళ్ళిపోతాడు. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్లు ఉంటుంది అతని పరిస్థితి. ఆ తరువాత పశ్చాత్తాపంతో భారమైన మనసుతో జీవిత గమనంలో తప్పకుండా అతను ముందుకు సాగవలసి ఉంటుంది.

కోపం అనేది బహుచెడ్డ విషయం ఏమీ కాదు. అది మనిషి తత్వంలో ఉండే ఒక సహజ గుణం. అది ఉండటం కూడా మనిషి జీవితానికి అవసరం. అది హద్దులు దాటినప్పుడే మనిషి ఇహపర లోకాలను నష్టపరుస్తుంది. సాధారణంగా మనిషి ఏదైనా చెడుకార్యం చూసినట్లయితే అతనికి తప్పకుండా కోపం వస్తుంది. కోపం అతనికి ఆ చెడు కార్యాన్ని అక్కడినుంచి తొలగించమనే సందేశాన్ని ఇస్తుంది. అప్పుడు అతను ఆ కోపంపై అదుపును సాధించి వివేకంతో ఆ చెడును తొలగించే ప్రయత్నం చేస్తే అప్పుడు ఆ కోపం అతనికి మంచిని తెచ్చిపెడుతుంది. ఈ విధంగా అతను ఒక మంచి సంస్కర్తలా పనికొస్తాడు. అతని ముందు చెడు జరుగుతున్నా అతని హృదయంలో ఎలాంటి కదలికలు, ఎలాంటి భావాలు రాకపోయినట్లయితే అతను సజీవంగా ఉన్నా, నిర్జీవమైపోయినట్లు అర్థం. కోపం వచ్చినప్పుడు దానిని అతిగా ప్రదర్శించటం, ఇష్టారాజ్యంగా వ్యవహరించటం చాలా పెద్ద తప్పు.

దైవప్రవక్త(స) వద్దకు ఆయన గారి ఒక అనుచరుడు వచ్చి ఓ దైవప్రవక్తా(స)! నాకు ఏదైనా హితబోధ చెయ్యండి అని విన్నవించుకున్నాడు. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: 'కోపాన్ని ప్రదర్శించకు' అన్నారు. ఈ విధంగా మూడుసార్లు ఆయన(స) అదే సమాధానం పలికారు. దీనిద్వారా విషయం స్పష్టంగా అర్థమవుతోంది.

# ఢాయి రూపియా దూంగా



\- ఉమైర్

**నేను** కొంతకాలం విజయవాడలో ఉన్నాను. ఇది ఎనభైలో మాట. అప్పట్లో లబ్బీపేటలో ఇప్పటిలా అపార్టుమెంట్లు, ఇన్ని భవనాలు లేవు. సిటి బస్టాపు వద్ద ఒక చెట్టు కూడా ఉండేది. మొగల్రాజపురంలో చాలా చల్లగా చెట్లు ఉండేవి.

లబ్బీపేట మస్జిదు చాలా ప్రశాంతంగా, చాలా హాయిగా ఉండేది. అక్కడే నమాజులు చదివేవాడిని. బీహారు నుంచి వచ్చిన ఒక యువకుడు ఇమామ్‌గా ఉండేవారు. ఆయన పేరు గుర్తులేదు. నాకు మిత్రుడైపోయారు. మస్జిదు రూములోనే ఉండేవారాయన. నాకు అప్పటికి పెళ్ళి కాలేదు కాబట్టి చాలా సార్లు మేమిద్దరం కలిసి వండుకునేవాళ్ళం. బిహారీ వంటకాలు చాలా బాగుంటాయి. బంగాళదుంపలు ఎక్కువగా వాడతారు.

ఒకరోజు నేను మధ్యాహ్నం మస్జిదుకు వెళ్ళే సరికి అక్కడ ఒక ఫకీరు కాస్త కోపంగా ఇమామ్‌తో మాట్లాడుతున్నాడు. ఇంత కోపంగా ఇమామ్‌తో మాట్లాడుతున్నాడేమిటా అని అక్కడకెళ్ళాను. ఆ ఫకీరు మధ్య వయస్కుడు. నన్ను చూసి "నేను ఈ మస్జిదుకు వచ్చానంటే నేను మెహ్మాన్ (అతిథి) కాదా" అన్నాడు. కాదనడానికి నాకు కారణమేమీ కనబడలేదు. అవునన్నట్లు తలూపా. ఇక్కడ ఉండేది ఈ ఇమామ్ గారే కదా అన్నాడు. అవునన్నా నేను. మరి అతిథి మర్యాదలు చేయాలా లేదా అన్నాడు. నేను బిత్తరపోయాను. ఇమామ్ వైపు తిరిగి తినడానికి ఏమైనా ఉంటే ఇవ్వరాదు అన్నా. ఇమామ్ కాస్త సీరియస్‌గా చూసి "మెహ్మాన్ తీన్ దిన్ కా హెూతా... హమేషా కా నహీ హెూతా" (అతిథి అంటే మూడు రోజులే... శాశ్వతంగా కాదు) అన్నారు. పాపం ఆ ఇమామ్ మాత్రం రోజు ఎక్కడి నుంచి తెచ్చి పెడతాడు. ఆయనకొచ్చే జీతంలో బిహారులో ఉన్న తన వాళ్ళకు కూడా పంపుకోవాలి. ఆ ఫకీరు కోపంగా "ఆప్ హదీస్ కా సహారా లేతే హెూ" (మీరు ప్రవక్త ప్రవచనాలను ఆసరాగా చేసుకుంటున్నారు) అని వెళ్ళిపోయాడు. నిజానికి రోజూ ఇమామ్ ఆ ఫకీరుకు అన్నం పెడుతుంది కూడా హదీసు కారణం గానే. అతిథులను ఆదరించాలనే హదీసు కారణంగానే ఈ ఫకీరుకు పాపం ఆయన అతిథి సత్కారాలు చేసేవారు.

ఈ ఇమాముకు తెలుగు ఒక్క ముక్క కూడా వచ్చేది కాదు. కూరగాయలు వగైరా కొనడానికి వెళ్ళినప్పుడు చాలా ఇబ్బంది పడేవారు.

ఒకసారి నేను బస్టాపు వద్దకు వెళ్ళేసరికి ఈ ఇమాము రిక్షా వాడితో గొడవ పడుతున్నారు. ఏమైందబ్బా అని వెళ్ళి అడిగాను. రిక్షావాడు రూపాయిన్నర ఇమ్మంటున్నాడు. ఈయన చాలా సీరియస్‌గా ఢాయి రూపియా దూంగా అంటున్నారు. నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. వాడు అడిగింది రూపాయిన్నర అయితే ఈయన రెండున్నర ఇస్తానని గొడవ పడుతున్నారు. వాడు అడిగింది రూపాయిన్నరే మహానుభావ మీరు రెండున్నర ఇవ్వక్కర్లేదు అని చెబితే... అచ్ఛా.. ఐసా... మగర్ దూరీ తో జ్యాదా హై... దో రూపియే దే దూంగా అన్నారు మళ్ళీ. నీ ఇష్టం బాబు అని రిక్షా వాడితో రెండు రూపాయలు ఇస్తాడు తీసుకోవయ్య అంటే వాడు పిచ్చ హ్యాపీ.

నా దగ్గర టోపీ ఎప్పుడూ ఉండేది కాదు. నమాజుకు వెళ్ళినప్పుడు కూడా టోపీ లేకుండానే వెళ్ళి నిలబడే వాడిని. చాలా మంది

ఇలాంటి చిన్న చిన్న విషయాలను పట్టించుకోరు. కాని అక్కడ ఒక పెద్దాయన, చాలా ఛాందసుడు ఉండేవాడు. ఎవరైనా టోపీ లేకుండా నమాజులో నిలబడితే ఆయనకు కోపం వచ్చేది. మస్జిదులో టోపీ లేకుండా ఎవరైనా వస్తే వారి కోసం ఈతాకులతో నేసిన టోపీలు ఉండేవి. ఇప్పుడు కూడా చాలా మస్జిదుల్లో ఉంటాయి. ఎవరైనా టోపీ లేకుండా నమాజులో నిలబడి ఉంటే ఈయన ఆ టోపీ తీసుకెళ్ళి వాడి నెత్తిన పెట్టేసేవాడు. ఒకసారి నేను నమాజులో ఉన్నప్పుడు ఈయన వెనక నుంచి వచ్చి నా నెత్తి మీద ఠపీమని ఆ టోపీ పెట్టాడు. కాస్త చికాగ్గా పెట్టాడేమో నాకు దెబ్బ తగిలేలా పెట్టాడు. నేను నమాజులో ఉన్నా కాబట్టి ఏమీ చెప్పలేను. కాని ఈ ఇమామ్ చూశారు. వెంటనే ఆ పెద్దాయన్ని పట్టుకున్నారు. టోపీ పెట్టేదయితే నెమ్మదిగా పెట్టవచ్చు కదా, అలా విసురుగా ఎందుకు పెట్టావని అడిగారు. ఆయన కోపంగా, నమాజులో మర్యాద లేదా.. టోపీ లేకుండా ఎలా నమాజ్ చేస్తారు అన్నాడు. అప్పటికి నా నమాజు పూర్తయి అక్కడికి వచ్చాను. నమాజులో టోపీ అవసరమా? అస్సలు నేను కూడా షమ్లా లేకుండా నమాజు చదివిస్తా ఏం చేస్తారో చేసుకోండి పోండి అన్నారు ఇమామ్. ఆయన టోపీ పైన పెద్ద షమ్లా (ఒకవిధమైన తలపాగా) కట్టేవారు. సర్లే వదిలేయండి... పెద్దాయనకు పట్టింపు ఎక్కువ అని నేను పక్కకు లాక్కెళ్ళాను.

ఖుర్ఆన్ అద్భుతంగా చదివేవారు. ఖుర్ఆన్‌లోనే ఒక అద్భుతమైన లయ ఉంది. ఈ ఇమామ్ గొంతు కూడా చాలా మధురంగా ఉండేది. వినేవాళ్ళు మంత్రముగ్ధులయ్యేలా చదివేవారు. ముఖ్యంగా రహ్మాన్ సూరా ఆయన చదువుతుంటే అలా వింటూ ఉండిపోవాలనిపించేది. అంత బాగా చదివేవారు. నమాజులో రహ్మాన్ సూరా కొంత చదివి ఆయన రుకూలోకి వెళితే అయ్యో ఇంకాస్త చదివితే బాగుండు అనిపించేది. మస్జిదులో మదరసా ఉండేది. నిజానికి అది మదరసా కాదు, పూర్తిస్థాయి స్కూలైతేనే మదరసా అనాలి. అది పూర్తి స్థాయి స్కూలు కాదు. మక్తబా లాంటిది అనవచ్చు. పొద్దుట ఫజర్ నమాజు తర్వాత పిల్లలు వస్తే వాళ్ళకు అరబీ ఉర్దూ నేర్పుతారు. మళ్ళీ సాయంత్రం అసర్ నమాజు తర్వాత అంటే దాదాపు 5 గం. దాటిన తర్వాత, స్కూళ్ళన్నీ వదిలేసిన తర్వాత పిల్లలు వచ్చేవాళ్ళు. అక్కడ నేను కూడా కొంతకాలం పిల్లలకు అరబీ, ఉర్దూ చదివించాను. ఈ ఇమామ్ వైట్ అండ్ వైట్ పైజామా జుబ్బా వేసుకుని తలపై షమ్లా కట్టుకుని వచ్చేవారు పిల్లలకు చదివించడానికి, బాగా ఎత్తయిన మనిషి. చూడగానే పిల్లలకు ఒకవిధమైన గౌరవభావం కలిగేది. మన జీన్సు ప్యాంటులు, హాఫ్ హ్యాండ్ స్లాకులు చూస్తే వాళ్ళకు అలాంటి ఇంప్రెషన్ వచ్చే అవకాశం లేదు. అందువల్ల ఈ ఇమామ్ అంటే నాకు ఒకవిధమైన అసూయ కూడా ఉండేది.

ఒకసారి నమాజు నిలబడి ఉంది. నేను కాస్త లేటుగా వెళ్ళాను. గబగబ వుజూ చేసుకుని, చెప్పులు బయట వదిలేసి నమాజులో జాయిన్ అయిపోయా. నమాజు తర్వాత వచ్చి చూస్తే చెప్పులు లేవు. నావే కాదు చాలా మంది చెప్పులు లేవు. అందరూ చెప్పులు వెదుక్కుంటున్నారు. అందరి చెప్పులు ఎవడెత్తుకెళ్ళాడబ్బా అనుకుంటున్నాం. కాసేపటికి నమాజు ముగించి ఒక పెద్దాయన బయటకు వచ్చారు. మమ్మల్ని చూసి ఏంటి చెప్పులు వెదుక్కుంటున్నారా? అన్నారు. అవునన్నాం. చెప్పులు అలా బయట ఇష్టమొచ్చినట్లు వదిలేస్తే ఎవరైనా ఎత్తుకుపోతే తర్వాత ఇబ్బంది పడతారు కదా... అందుకే నేనే చెప్పులన్నీ తీసుకెళ్ళి అదిగో అక్కడ చెప్పులు వదిలే డబ్బా ఉంది కదా.. అందులో వేశాను తెచ్చుకోండి అన్నారు. అంతేకాదు, పావలా వస్తువైనా దాన్ని జాగ్రత్త చేసుకుని నమాజుకు నిలబడాలి అని హితబోధ కూడా చేశారు. పాపం పెద్దాయన మా చెప్పులన్నీ తీసుకెళ్ళి దాచాడంటే కాస్త సిగ్గనిపించింది. మేం వెళ్ళి చెప్పులు తెచ్చుకున్నాం. అందరికన్నా చివరగా ఈ ఇమామ్ నమాజులు ముగించుకుని వచ్చారు. తన చెప్పులు కనబడలేదు. చెప్పులు పోయినట్లున్నాయి అన్నారు. లేదులేండి.. ఆ డబ్బాలో ఉంటాయి తెచ్చుకోండి అన్నాను. డబ్బాలో ఎవరేశారు అన్నారు. నేను జరిగింది చెప్పి పాపం పెద్దాయన మన చెప్పులు తీసుకెళ్ళి డబ్బాలో జాగ్రత్త చేసాడంటే కాస్త సిగ్గుగా ఉంది అన్నాను. ఇందులో సిగ్గుపడ్డానికేముంది, ఆయనకు తోచింది చేశాడు. మనకు అలా అనిపిస్తే మనం చేసేవాళ్ళం అన్నారు.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# అప్పు తప్పు - ముప్పు



**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**గత సంచిక తరువాయి**

### అప్పు గర్హించదగినది

రుణగ్రస్తుడై ఉన్న వ్యక్తి చనిపోయి అతని జనాజా (శవపేటిక)ను దైవప్రవక్త(స) వద్దకు తీసుకురావటం జరిగితే, "ఇతను (మృతుడు) తన అప్పును తీర్చడానికి ఆస్తి ఏదైనా వదలిపోయాడా?" అని దైవప్రవక్త (సఅసం) అడిగేవారు. అతను అప్పు తీర్చడానికి సరిపడే అంత ఆస్తి వదలిపోయాడని సమాధానం వస్తే ఆయన(స) అతని జనాజా నమాజు చేయించేవారు. అలాంటి సమాధానం రాకపోతే "మీరే మీ సహచరుని జనాజా నమాజ్ చేసుకోండి" అని చెప్పేసే వారు. కొంత కాలానికి దేవుడు (తన ప్రవక్త కోసం) విజయ ద్వారాలు తెరిచాడు. (అంటే పెద్ద ఎత్తున విజయప్రాప్తి రాసాగింది) అప్పుడాయన (స) ఇలా అన్నారు - "నేను విశ్వాసులకు వారి ప్రాణాలకన్నా సమీపంగా ఉన్నాను. కనుక (ఇకనుంచి) ఎవరయినా ముస్లిం చనిపోతే, అతను ఎవరికయినా బాకీ పడి ఉంటే, ఆ బాకీ నేను తీరుస్తాను" (బుఖారీ, ముస్లిం)

ఎవరయినా ముస్లిం రుణగ్రస్తుడై వున్న స్థితిలో చనిపోతే, అతని వారసులుగానీ, బంధుమిత్రులుగానీ అతని రుణాన్ని తీర్చే బాధ్యతను స్వీకరించకపోతే ఇస్లామీయ ప్రభుత్వమే బైతుల్ మాల్ (ప్రభుత్వ ధనాగారం) నుండి దాన్ని తీరుస్తుందని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. మహనీయ ముహమ్మద్(స)కు సమాజంలోని రుణగ్రస్తుల, అగత్యపరుల, నిరాధార జీవులపట్ల గల దయా దాక్షిణ్యాలు కూడా ఈ హదీసు ద్వారా వ్యక్తమవు తున్నాయి.

రాజ్యాధికారులు తన రాజ్య ప్రజల పట్ల ఎంత బాధ్యతతో, మరెంత వాత్సల్యంతో మసలుకోవాలో కూడా ఈ హదీసు సూచిస్తోంది. అప్పు తీర్చటం ఎంత ముఖ్యమైన బాధ్యతో ఈ హదీసు నొక్కి చెబుతోంది. మనిషి తాను జీవించి ఉండగానే అప్పు తీర్చటం చాలా మంచిది. రుణగ్రస్తుడు చనిపోయినప్పుడు అతని జనాజా నమాజు చేయడానికి దైవప్రవక్త(స) అంగీకరించ లేదంటే, అది చూచి బ్రతికి ఉన్నవారు దైవానికి భయపడి తమ అప్పులను తీర్చివేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారని ఆయన ఆశించి ఉండవచ్చు.

### అప్పు బాధ్యత తీసుకున్న వ్యక్తి తన సంపద నుండే అప్పు తీర్చాలి

హజ్రత్ జాబిర్ (రజి) కథనం : మాలోని ఒక వ్యక్తి చనిపోయాడు.

మేము అతనికి (భౌతిక కాయానికి) స్నానం చేయించాము. సువాసన పూశాము. కఫన్ వస్త్రం తొడిగించాము. ఆ తరువాత అతన్ని (శవపేటికను) దైవప్రవక్త (సఅసం) సన్నిధికి తీసుకువచ్చి, "తమరు ఇతని అంత్యక్రియల ప్రార్థన చేయించాలి" అని అభ్యర్థించాము. ఆయన(స) కొన్ని అడుగులు ముందుకు రావటానికి లేచారు. మరి అంతలోనే, "ఇతను ఎవరికయినా ఏమైనా బాకీ పడి ఉన్నాడా?" అని దర్యాప్తు చేశారు. "రెండు దీనార్లు బాకీ పడి ఉన్నాడ"ని మేము విన్నవించు కున్నాము. ఇది వినగానే ఆయన(స) వెనక్కి వచ్చేశారు. అబూ ఖతాదా (రజి) ఆ రెండు దీనార్ల బాకీని చెల్లించే బాధ్యతను స్వీకరించారు. తరువాత మేమంతా ఆయన (స) వద్దకు వచ్చాము. "ఆ రెండు దీనార్ల రుణగ్రస్తుని రుణాన్ని తీర్చే బాధ్యత నాది" అన్న అబూ ఖతాద (రజి) గారినుద్దేశించి దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "రుణగ్రస్తుని మాదిరిగా ఇది నీపై తప్పనిసరి అయిపోయింది. ఇక దీన్ని చెల్లించవలసిన బాధ్యత కేవలం నీదే. మృతుడు ఈ బాధ్యత నుండి విముక్తి పొందాడు. అవునా?" అని ఆయన(స) రెట్టించగా 'అవును' అని ఆయన ఒప్పుకున్నారు. అప్పుడు ఆయన (సఅసం) అతని నమాజ్ జనాజా చేయించారు."

(అహ్మద్, అబూదావూద్, నసాయి)

ఈ హదీసు ద్వారా అనేక అంశాలు మన ముందుకు వస్తున్నాయి. (1) మృతుని తరపున రుణం చెల్లించే బాధ్యతను ఎవరయినా స్వీకరిస్తే అది సమంజసమే. (2) రుణం చెల్లిస్తానని పూచీగా ఉన్న వ్యక్తి ఆ పైకాన్ని మృతుని ఆస్తి నుండి తీసుకోజాలడు. అతడు తన కష్టార్జితం నుండి దాన్ని చెల్లించవలసి ఉంటుంది. (3) అప్పులైనా లేదా ఇతర దాసుల హక్కులైనా వాటిని తీర్చనంత వరకూ, హక్కుదారులు లేదా రుణదాతలు వాటిని క్షమించి వదలి పెట్టనంత వరకూ అవి సమసిపోవు. (4) అప్పు తీసుకోవటం ఎంతో సున్నితమైన, జటిలమైన వ్యవహారం. సాధ్యమైనంతవరకు అప్పుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి. ఒకవేళ అప్పు తీసుకోవటం వినా మరో గత్యంతరం లేదనుకుంటే ఆ అప్పును వీలైనంత తొందరగా తీర్చివేసేందుకు ప్రయత్నించాలి.

## రుణం మార్పిడి, భరోసా

దైవప్రవక్త (స) ప్రబోధించినట్లు హజ్రత్ అబూ హురైరా(రజి) తెలియజేశారు : "శ్రీమంతుడు రుణం చెల్లించటంలో తాత్సారం చేయటం అన్యాయం. రుణగ్రస్తుడు తన రుణం తీర్చే విషయమై శ్రీమంతుని హవాలా (రెఫరెన్సు) ఇస్తే (రుణదాత) దాన్ని అంగీకరించాలి" (బుఖారీ, ముస్లిం). 'అహ్మద్'లోని ఒక ఉల్లేఖనంలో 'హవాలాను ఒప్పుకోవాలి' అని వుంది.

ఈ హదీసులో 'హవాలా' గురించి చెప్పబడింది. ఈ 'హవాలా'కు రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి: ఒక వ్యక్తి రుణం విషయంలో పూచీగా ఉంటాడు. అంటే ఫలానా వ్యక్తికి ఇంత పైకం అప్పుగా ఇవ్వు. దీనికి బాధ్యత నాది అని అంటాడు. రెండు : తాను చెల్లించవలసిన బకాయిని ఫలానా వ్యక్తి నుండి వసూలు చేసుకో అని అంటాడు. ఉదాహరణకు అఫ్సర్- ఆరిఫ్- ఇర్ఫాన్ అనే ముగ్గురు వ్యక్తులున్నారు. అఫ్సర్ అనేవాడికి ఆరిఫ్ నుండి వెయ్యి రూపాయలు రావలసి ఉన్నాయి. ఆరిఫ్‌కు ఇర్ఫాన్ నుండి వెయ్యి రూపాయలు రావాలి. ఆరిఫ్, అఫ్సర్‌ను ఉద్దేశించి నేను నీకు ఇవ్వవలసిన వెయ్యి రూపాయల బకాయిని ఇర్ఫాన్ నుండి తీసేసుకో అని అంటాడు. ఈ రకమయిన సర్దుబాటును షరీయత్ ఆమోదిస్తోంది. అయితే ఇర్ఫాన్ తాను ఆరిఫ్‌కు వెయ్యి రూపాయలు బాకీ ఉన్నానన్న సంగతి నిజమేననీ, ఆ మొత్తం నీకు ఇస్తానని అఫ్సర్‌తో చెప్పాలి.


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అరబ్బు దేశాల బ్యాంకులలో 'డ్రాఫ్టు'ను 'హవాలా'గా వ్యవహరిస్తారు. డ్రాఫ్టు తయారు చేసి ఇచ్చే బ్యాంకు పైకం జమ చేసిన వ్యక్తికి ఒక రశీదు ఇచ్చి, ఈ రశీదు ఆధారంగా ఫలానా బ్యాంకు నుండి డబ్బు డ్రా చేసుకోవచ్చని అంటుంది. ఇది అక్కడి హవాలా అధునాతన పద్ధతి. ఇది షరీయత్‌కు అనువైనదే.

## షహీద్‌కి కూడా రుణ మాఫీ లేదు

దైవప్రవక్త(స) ప్రబోధించారు: అరువు, అప్పు తప్ప అమరవీరుని ప్రతి పాపం క్షమించబడుతుంది. (సహీహ్ అల్ జామె)

## అప్పు తిరిగి ఇవ్వని వాడు దౌర్జన్యపరుడు, దొంగ

అప్పులు చేసి తిరిగి చెల్లించకూడదని నిశ్చయించుకున్న వ్యక్తి- ఈ డబ్బును తిరిగి ఇవ్వాలనే ఉద్దేశ్యం లేకుండా అప్పు తీసుకుంటే అతను రేపు అల్లాహ్‌ను కలుసుకున్నపుడు ఒక దొంగలా ముద్ర వేయబడి ఉంటాడు. (ఇబ్ను మాజహ్)

దైవప్రవక్త (స) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "ఎవరైతే (అప్పుగా) తీసుకుని జనులకు దాన్ని తిరిగి చెల్లించాలని పరితపిస్తూ ఉంటాడో అతని అప్పును తీర్చడంలో అల్లాహ్ తోడ్పడతాడు. మరెవరయితే వారి (జనుల) సొమ్మును కాజేయాలని సంకల్పించుకుంటాడో అతన్ని అల్లాహ్ వృధా పరుస్తాడు." (బుఖారీ) అందరూ మంచోళ్ళు కాదు. కొందరు ముంచేటోళ్ళు కూడా ఉంటారు జాగ్రత్త!

## మహర్ కూడా రుణమే

"ఏ పురుషుడైనా సరే, చిన్న లేదా పెద్ద మహర్‌తో స్త్రీని వివాహం చేసుకొని, ఆమెకు హక్కులు చెల్లించాలనే ఆలోచన లేకుండా, ఆమెను మోసం చేసి, చనిపోయి, ఆమెకు హక్కులు చెల్లించకుండా ఉంటే, అతను పునరుత్థాన దినాన దేవుడిని ఒక వ్యభిచారిలా కలుసుకుంటాడు" అన్నారు దైవప్రవక్త(స). (సహీహ్ తర్గీబ్)

## అప్పు భారాన్ని తొలగించే అద్భుతమైన దుఆ

రుణభారంతో నలిగిపోతున్న ఒక వ్యక్తి దేవుని బెబ్బులి హజ్రత్ అలీ (ర) గారి సన్నిధికి వచ్చి- నాపై చాలా రుణం ఉంది. దాన్ని నేను తీర్చలేకపోతున్నాను. ఏదైనా పరిష్కార మార్గం ఉంటె సెలవియ్యండి అని విన్నవించుకోగా - ఆయన (ర) ఇలా అన్నారు: నాకు దైవప్రవక్త(స) నేర్పించిన అద్భుత వాక్యాలను నేను నీకు నేర్పిస్తాను. ఒకవేళ నీపై శీర్ పర్వతం అంతటి అప్పు ఉన్నా దాన్ని తీర్చే ఏర్పాటు అల్లాహ్ చేస్తాడు అని ఈ దుఆ నేర్పించారు: "అల్లాహుమ్మక్ ఫినీ బిహలాలిక అన్ హరామిక, వ అగ్నినీ బిఫదొక అమ్మన్ సివాక్".

ఓ అల్లాహ్! నువ్వు హలాల్ చేసినది మాత్రమే నాకు సరిపోవాలి. నువ్వు హరామ్ చేసిన వాటి అవసరం నాకు రాకూడదు. నీ కృపా కటాక్షంతో నాకు ఎవ్వరి అవసరం రాకుండా చూడు: ఒక్క నీ అవసరం తప్ప. (తిర్మిజీ 3-180).

అల్లాహుమ్మ ఇన్నీ అఊదుబిక మినల్ హమ్మి వల్ హుజ్ని, వల్ ఇజ, వల్ కసలి వల్ బుఖ్లి వల్ జుబ్ని, వదలఇద్ దైని, వ గలబతిర్రిజాలి.

ఓ అల్లాహ్! నేను ఆందోళన, దుఃఖాల నుండీ, దీనత్వం, సోమరితం నుండీ, పిసినారితనం, పిరికితనం నుండీ, అప్పుల భారం నుండీ, నాపై ప్రజలు పెత్తనం చలాయించటం నుండి నీ శరణు కోరుకుంటున్నాను. (బుఖారీ).

## విశ్వాసి వజ్రాయుధం దుఆ

అల్లాహుమ్మ అస్లిహ్ లీ దీనియల్లజీ హువ ఇస్మతు అమ్రీ, వఅస్లిహ్ లీ దున్యాయల్లతీ ఫీహా మఆషీ, వఅస్లిహ్ లీ ఆఖిరతియల్లతీ ఫీహా మఆదీ, వజ్అలిల్ హయాత జియాదతల్లీ ఫీ కుల్లి ఖైర్ ,వజ్అలిల్ మౌత రాహతల్లీ మిన్ కుల్లి షర్ర్.

"ఓ అల్లాహ్! నా ధర్మాన్ని నా కోసం సవ్యంగా చెయ్యి. అది నా వ్యవహారానికి ప్రాతిపదిక. ఇంకా, నా కొరకు ప్రపంచాన్ని సజావుగా చెయ్యి. అందులో నా జీవితం ఉంది. ఇంకా, నా కొరకు పరలోకాన్ని సజావుగా చెయ్యి. దాని వైపునకే నేను మరలవలసి ఉంది. ఇంకా జీవితాన్ని నా కొరకు, అన్ని రకాల శ్రేయాలలో సమృద్ధికి మూలంగా చెయ్యి. ఇంకా, మరణాన్ని అన్ని రకాల ఆపదల నుండి విముక్తినిచ్చే సాధనంగా చెయ్యి." (సహీహ్ ముస్లిం 2720)

హజ్రత్ సల్మాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: "మీ ప్రభువు ఎంతో ఉదాత్తుడు, బిడియం కలవాడు. తన దాసుడు తన సన్నిధిలో చేతులు చాచి అర్థించినపుడు వట్టి చేతులతో మరలించడానికి ఆయన సిగ్గుపడతాడు." ( హాకిమ్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

'అప్పు తీసుకోవడం పెళ్లి లాంటిది; తిరిగి ఇవ్వడం చావు లాంటిది. "అప్పు తీసుకోవడం, ఇవ్వడం స్నేహాన్ని పాడు చేస్తుంది" అంటారు. కాబట్టి అప్పు చేయకపోవడమే ఒప్పు. అదే ప్రజలకు ప్రభువుకి మెప్పు. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఈ అప్పు అనే తప్పు చేయకూడదు. లేదా తప్పదు ముప్పు! కాదు కూడదు అంటే చెప్పు, వదలగొడుతుంది అప్పు నీకు పట్టిన ధనవ్యామోహ తుప్పు!!

**(సమాప్తం)**

# ~~హరామ్~~ హలాల్ కమాయి

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**నేను** ముహమ్మద్ అబ్దుల్ లియాఖత్ ఖాన్ గురువు (ముహమ్మద్ అబ్దుల్ రషీద్ ఖాన్) గారి వద్ద శిష్యునిగా ఉన్నప్పుడు ఆయన నాకు పని మీద పెట్టారు. నేను బియ్యం బస్తాలను, సరుకులను లారీలో ఎక్కించే దించే పనులు చేసేవాడిని. నేను ఉదయమంతా కష్టపడి సంపాదించిన డబ్బులను నా గురువు నాకు రెండు పూటలకు సరిపడేంత ఉంచి మిగతా వాటిని దానం చేసేవారు. నేను ఒక రోజు ఆయన్ను అలా ఎందుకు చేస్తున్నారు, అందులో ఉన్న మర్మమేమిటో తెలుపమని అడిగాను. ఆయన చిరునవ్వు చిందిస్తూ 'నువ్వు పదకొండు నెలలు ఈ పని చెయ్యి, ఆ తరువాత నేను దీనికి సమాధానం చెబుతాను' అన్నారు. నేను పదకొండు నెలలు బాగా కష్టపడి నా పని చేసుకుంటూ పోయాను. నా గడువు ముగిసిన రోజు నా గురువు నాతో 'నువ్వు ఈ రోజు కూడా పనికి వెళ్ళు. పని ప్రారంభించిన తరువాత 'ఆరోగ్యం బాగా లేదని సాకు చెప్పి సాయంత్రం వరకు పని చేయకుండా ఉండు. సాయంత్రం నీకు రావాల్సిన వేతనాన్ని తీసుకుని అక్కడి నుంచి తిరిగి వచ్చేయి' అన్నారు. నేను గురువు గారు చెప్పినట్లే చేశాను. కడుపులో, నెత్తిలో నొప్పిగా ఉందని చెప్పి పగలంతా ఒక చోట నిద్రపోతూ గడిపాను. సాయంత్రం వేతనం తీసుకుని గురువు గారి వద్దకు వచ్చాను. గురువుగారు 'రెండు పూటల భోజనానికి సరిపడా డబ్బులను ఉంచుకుని మిగతాది దానం చెయ్యి' అన్నారు. మీరు నమ్ముతారో లేదో కాని పదకొండు నెలల్లో మొదటిసారి నాకు దానం చేయాలని అనిపించలేదు. నేను ఆ రోజు బాగా తిన్నాను. కాని నా ఆకలి మాత్రం తీరలేదు. ఆ రోజు రాత్రి నేను మొదటిసారి తలుపుకు గడియపెట్టాను. కంటి నిండా నిద్రపోవడానికి ప్రయత్నించాను. కాని నాకు నిద్ర సరిపోలేదు. మరుసటి రోజు నా శరీరం నుంచి దుర్వాసన రాసాగింది. దాన్ని తట్టుకోడానికి బట్టలకు పర్ఫ్యూమ్ కొట్టాల్సి వచ్చింది. తొలిసారి నాకు నమాజ్లో ఏకాగ్రత కుదరలేదు. నేను నా పరిస్థితిని గురువు గారికి వినిపించాను. ఆయన నవ్వి ఇలా అన్నారు: 'శిష్యా! ఇది అధర్మ సంపాదన. అధర్మ సంపాదన నీ జీవితంలోని సుఖాలను లాక్కొంటుంది. మనిషిని జంతువులా మార్చేస్తుంది. హరామ్ ఎప్పుడూ నీ ఆకలిని తీర్చదు. నీ నిద్రను పెంచుతుంది. అది నీ శరీరంలో దుర్వాసన పుట్టిస్తుంది. అది నీ మనస్సును కుంచించుకుపోయేలా చేస్తుంది. నీ ఆలోచనను కుదించి వేస్తుంది. నీ మనశ్శాంతిని లాక్కుంటుంది. నీవు ఒక్క రోజు హరామ్కు పాల్పడితే అది నిన్ను నలభై రోజుల పాటు వేధిస్తుంది. నువ్వు ఈ 40 రోజులు అబద్ధాలు చెబుతావు. చాడీలు చెబుతావు. నీలో అత్యాశ పెరుగుతుంది. ఇతరులను మోసం చేయాలనిపిస్తుంది. సంపన్నుడినవ్వాలనే కోరిక నీలో జనిస్తుంది.

గురువుగారు చెప్పినదంతా విన్న తరువాత నాకు భయమేసింది, నేను గురువుగారితో 'నేను హరాం వల్ల జరిగే అనర్థాల నుంచి సురక్షితంగా ఉండాలంటే ఏం చేయాలి?' అని అడిగాను. ఆయన ఇలా చెప్పారు: నఫిల్ ఉపవాసాలు ఉండు, దాన ధర్మాలు చేస్తూ ఉండు, అంతిమ దివ్య ఖుర్ఆన్ని తర్జుమాతో చదువు, ప్రతిరోజు ఐదు పూటలు జమాఅత్తో నమాజు ఆచరించు. అవి నిన్ను పవిత్రునిగా చేస్తాయి. ఇంకా ఇలా అన్నారు. నేను నలభై ఏళ్ళలో నేర్చుకున్న దాన్ని నీకు తెలుపుతున్నాను శ్రద్ధగా విను, ఈ విశ్వం ఒక పెట్టె లాంటిది. దానికి తాళం వేసి ఉంది. అది ఒక గొప్ప పేరుతో తెరుచుకుంటుంది. ఆ పేరే హలాల్.. నువ్వు జీవితంలో హలాల్ను పెంపొందించుకుంటూ వెళ్ళు. ఆ పెట్టె తెరుచుకుంటూ పోతుంది. ఆ తరువాత నేను అడిగాను, హరామ్ను ఎలా గుర్తించాలి అని. ఆయన చెప్పారు, ప్రపంచం లోని ఏ వస్తువును నువ్వు చూసినా, విన్నా, రుచి చూసినా, ముట్టుకున్నా ఆ తరువాత నీలో దాని అత్యాశ కలిగినట్లయితే అది హరామ్.

నువ్వు ఆ హరామ్కు దూరంగా ఉండు. అది నీ ఉనికిని సర్వనాశనం చేసేస్తుంది. నిన్ను నిర్వీర్యం చేస్తుంది. నీకు అపకీర్తిని తెచ్చిపెడుతుంది. సమాజంలో నిన్ను తలెత్తుకోకుండా చేస్తుంది. ప్రజల్లో నీ గౌరవాన్ని తగ్గిస్తుంది. నీ ముఖ వర్చస్సును తగ్గిస్తుంది.

ముహమ్మద్ అబ్దుల్ లియాఖత్ ఖాన్కు విషయం మొత్తం అర్థమైపోయింది. లేచి ఇంట్లోనే వుజూచేసి శర్వదాన్ కాలనీలో ఉన్న మహబూబ్ ఉన్నిసా మస్జిద్లో రెండు రకతులు నమాజ్ చేసి అల్లాహ్తో దుఆ చేస్తూ సాష్టాంగ పడిపోయాడు. ❖



# ఆది దంపతులు ఆదమ్ హవ్వా

అమ్రూ

**దేవుడు** సృష్టించిన ఈ విశ్వంలో భూగ్రహం అద్భుతమైన సృష్టి. సూర్యుని వేడి, వెలుతురు, నీరు గాలి ధారాళంగా లభించే ఈ భూగ్రహంపై ఒకప్పుడు మానవజాతి లేదు. అద్భుతమైన ప్రకృతి సౌందర్యంతో అలరారే భూగ్రహంపైకి మానవుడిని సృష్టించి పంపాలని సృష్టికర్త భావించాడు. ఈ ఆలోచన రాగానే ప్రప్రథమ మానవుడిని సృష్టించాడు. మట్టితో సర్వాంగ సుందరంగా, అద్భుతమైన అవయవసౌష్టవంతో తయారు చేసి ప్రాణం పోశాడు. ఆ ఆది మానవుడే హజ్రత్ ఆదమ్(అలై). మానవాళి యావత్తు ఆయన సంతానమే.

మానవుల కంటే ముందు దేవుడు దైవదూతలను, జిన్నులను సృష్టించాడు. దైవదూతలు దైవాదేశాలను తూ.చ.తప్పక పాటిస్తారు. స్వయంగా నిర్ణయాలు తీసుకోవడం ఉండదు. జిన్నులకు నిర్ణయాలు తీసుకునే పరిమిత స్వేచ్ఛను దేవుడు ఇచ్చాడు. మానవుడిని సృష్టించే ముందు సృష్టికర్త దైవదూతలందరినీ ఉద్దేశించి "మేము ఆదమ్‌ను సృష్టించి మా ప్రతినిధిగా భూమండలానికి పంపాలనుకుంటున్నాము" అన్నాడు. సృష్టికర్త తనకు ఖలీఫాగా లేదా ప్రతినిధిగా మనిషిని సృష్టించాడు. ఈ లోకానికి అసలు అధిపతి, యజమాని దేవుడు. ఆ దేవునికి ప్రతినిధిగా మనిషి సృష్టించబడ్డాడు. దేవుడు మనిషిని ఈ లోకానికి పంపిస్తూ చేయవలసిన పనులేవో స్పష్టంగా నిర్దేశించాడు.

మానవుడిని సృష్టించి, తన ప్రతినిధిగా భూమండలానికి పంపుతానని దేవుడు చెప్పినప్పుడు దైవదూతలు భయాందోళనలు వెలిబుచ్చారు. దేవుని ముందు అత్యంత వినమ్రంగా "మహాప్రభూ, కల్లోలాన్ని రేపే, రక్తాన్ని చిందించే మానవుణ్ణి నీ ప్రతినిధిగా నియమిస్తావా? నీ మహిమను, నీ కీర్తిని, ఎల్లవేళలా కీర్తిస్తూ, నీ సేవలో మేము నిమగ్నమై ఉన్నాం కదా" అన్నారు. కాని, దేవుడు సర్వజ్ఞుడు. దైవదూతలను ఉద్దేశించి దేవుడు "మాకు తెలిసిన విషయాలు మీకు తెలియవు. మానవసృష్టిలో మేము ఏ అపూర్వ శక్తులను ఉంచామో మీకు తెలియదు. మనిషి భూలోకానికి వెళ్ళి మేము ప్రసాదించిన జ్ఞానాన్ని, శక్తి సామర్థ్యాలను ఉపయోగించి భూగర్భంలో దాగి ఉన్న నిధులను వెలికితీస్తాడు. మేము సృష్టించిన వస్తుసంపదను ఉపయోగిస్తాడు. మీకు ఈ విషయాలు తెలుసా?" అని ప్రశ్నించాడు. దైవదూతలకు ఈ విషయాలేవీ తెలియవు. "ప్రభూ, నీవు తెలిపిన విషయాలు తప్ప మరేమీ మాకు తెలియవు. ఇతర జ్ఞానము మాకు లేదు. నీవు సర్వమూ తెలిసిన వాడవు" అని జవాబిచ్చారు.

అప్పుడు సృష్టికర్త తొలి మానవుడైన ఆదమ్‌తో "ఆదమ్, ఈ వస్తువుల పేర్లు తెలియజేయి" అన్నాడు. ఆదమ్‌ను సృష్టించినప్పుడే భూలోకంలో ఉన్న సమస్త వస్తువుల స్వరూప స్వభావాల జ్ఞానాన్ని కూడా దేవుడు ప్రసాదించాడు. దేవుని ఆజ్ఞానుసారం వెనువెంటనే ఆదమ్ ఆయా వస్తువుల గురించి చెప్పారు. ఆదమ్ వాటన్నింటి గురించి చెప్పిన తర్వాత దేవుడు దైవదూతలతో "భూమ్యాకాశాల్లో దాగి ఉన్న సమస్త రహస్యాలు మాకు తెలుసని నేను మీకు చెప్పలేదా? మీరు పైకి ప్రకటించేవి, లోపల దాచేవి అన్నీ మాకు తెలుసు." అన్నాడు.

దేవుని ప్రతినిధిగా భూమండలానికి పంపబోయే ఆదమ్ పట్ల గౌరవ సూచకంగా దైవదూతలందరూ ఆదమ్‌కు సాష్టాంగ పడాలని దేవుడు ఆదేశించాడు. దైవదూతలలో షైతాన్ కూడా ఉన్నాడు. దేవుని ఆదేశం అయిన వెంటనే దైవదూతలందరూ సాష్టాంగపడ్డారు. కాని షైతాన్ గర్వించాడు. మట్టితో తయారైన

మనిషికి సాష్టాంగపడడమా అని నిరాకరించాడు. అహంభావంతో తిరుగుబాటుకు పూనుకున్నాడు. గర్విష్ఠి అయిన షైతాన్ దేవునితో "ప్రభూ, మట్టితో సృష్టించిన ఈ మానవుడికి నేను సాష్టాంగపడను. నేను అతని కంటే ఘనుడను. నువ్వు నన్ను అగ్నితో సృష్టించావు" అన్నాడు. షైతాన్ ప్రదర్శించిన ధిక్కారం, తిరుగుబాటు, తలబిరుసు తనం దేవునికి అమితాగ్రహం కలుగజేశాయి. షైతాన్ పట్ల ఆగ్రహించిన అల్లాహ్ వాడిని తన దర్బారు నుంచి బహిష్కరించాడు. షైతాన్ ఈ శిక్ష తర్వాత తనకు ప్రళయకాలం వరకు వ్యవధి ఇవ్వమని దేవుని కోరాడు. మానవులను దారి తప్పించి నరకానికి ఆహుతయ్యేలా చేస్తానన్నాడు. ప్రళయకాలం వరకు షైతాన్ వ్యవధి పొందాడు. భూలోకం అతడి స్థావరమ య్యింది. తీర్పుదినాన షైతాన్, అతన్ని అనుసరించి, దైవాదేశాలను ఉల్లంఘించిన మానవులు నరకవాసులవుతారు.

హజ్రత్ ఆదమ్‌కు తోడుగా ఉండడానికి ఒక జతను కూడా అల్లాహ్ సృష్టించాడు. ఆ స్త్రీమూర్తి పేరు హవ్వా. హజ్రత్ హవ్వా (అలైహిస్సలామ్) మానవాళి అందరికీ తల్లి. ఆదమ్ హవ్వాలు ప్రారంభంలో స్వర్గలోకంలోనే ఉండేవారు. వారికి అక్కడ అన్ని రకాల సదుపాయాలు, సౌఖ్యాలు అందుబాటులో ఉండేవి. తినడానికి అత్యంత రుచికరమైన పండ్లు, తాగడానికి మధురమైన పానీయాలు, విశ్రాంతికి విహారానికి కావలసిన ఏర్పాట్లు దేనికీ కొరతలేదు. వారిని స్వర్గలోకంలో ఉండమని చెప్పిన దేవుడు వారితో "మీరు స్వర్గంలోకంలో హాయిగా జీవించండి. మీకు అవసరమైనది హాయిగా తినండి, తాగండి. కాని (ఒక చెట్టును చూపించి) ఆ చెట్టు దరిదాపులకు మాత్రం పోవద్దు" అని చెప్పాడు. తొలి మానవులిద్దరు ఎంతో సంతోషంగా స్వర్గంలోకంలో ఉండేవారు.

అల్లాహ్ దర్బారులో బహిష్కరణకు గురైన షైతాన్ తీవ్రమైన కోపానికి, క్షోభకు గురయ్యాడు. వాడు తన తప్పును గ్రహించి, ఒప్పుకుని క్షమించమని దేవుడిని వేడుకోవలసింది. కాని అలా చేయలేదు. గర్విష్టి అయిన షైతాన్ తన దుస్థితికి తొలి మానవులైన ఆదమ్ హవ్వాలే కారణమనుకున్నాడు. వారిపై పగ పట్టాడు. ప్రతీకారం కోసం కాచుక్కూర్చున్నాడు. "ఫలానా వృక్షం దరిదాపులకు పోవద్దు" అని దేవుడు ఆదమ్ హవ్వాలకు ఆదేశించాడన్నది షైతాన్‌కు తెలుసు. వారిని దారితప్పించాలని భావించాడు. ఒక రోజు చాలా అమాయకమైన ముఖంతో, సాధుత్వం పులుముకుని, వారిదగ్గరకు వచ్చాడు. కపట నాటకాన్ని ప్రారంభించాడు. "స్వర్గంలో సమస్తం అనుభవించే అధికారం మీకు ఇచ్చి ఆ ఒక్క చెట్టు దగ్గరకు మాత్రం వెళ్ళొద్దని దేవుడు ఎందుకు చెప్పాడో మీకు తెలుసా?" అనడిగాడు. అసలు విషయ మేమంటే, ఈ చెట్టు చాలా మహత్తు కలిగిన చెట్టు. దాని పండ్లు తింటే ఇక చావు రాదు. మరణం ఉండదు. ఈ పండు మీరు తింటే మీరు కూడా మరణం లేని దైవదూతలై పోతారు. నేను ఒట్టేసి చెబుతున్నాను. మీ శ్రేయోభిలాషిని, మీ మిత్రుడిని, మీ మంచి కోరేవాడిని అందుకే ఈ రహస్యం చెబుతున్నాను" అన్నాడు. ఇలాంటి మాటలతో షైతాన్ చివరకు ఆదమ్ హవ్వాలు దైవాదేశాన్ని ఉల్లంఘించేలా ప్రేరేపించాడు.

అమాయకపు ముఖంతో, సాధుస్వభావునిగా కనిపిస్తూ షైతాన్ ఆడిన కపటనాటకాలు పనిచేశాయి. షైతాన్ తమకు బద్ధవిరోధి అని, పగ తీర్చుకునే ప్రయత్నంలో ఉన్నాడని వారికి తెలియదు. షైతాన్ పన్నాగం ఫలించింది. వాడి మోసంలో పడిన వారిద్దరూ దేవుని నిషేధాజ్ఞలు ఉల్లంఘించారు. ఆ పండు తినగానే అప్పటి వరకు వారి శరీరాలను కప్పి ఉన్న దైవిక వస్త్రాలు మాయ మయ్యాయి. వారు నగ్నంగా మిగిలారు. ఈ హఠాత్పరిణామానికి వారు బిత్తరపోయారు. భయభీతులకు గురయ్యారు. అప్పటి వరకు నగ్నత్వం తెలియని వారు తమ మర్మాయవాలను చెట్ల ఆకులతో కప్పుకునే ప్రయత్నం చేశారు. తమ వల్ల ఘోరమైన తప్పిదం, పెద్దపాపం జరిగిపోయిందని గ్రహించారు. దేవుడు తమపై ఆగ్రహించాడని తెలుసుకున్నారు.

చేసిన పాపానికి విలపిస్తూ, పశ్చాత్తాపంతో సాష్టాంగపడుతూ దేవుని వేడుకున్నారు. షైతాన్ మాదిరిగా వారు గర్వపడలేదు. తమ తప్పు గ్రహించారు. తాము చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. మన్నించమని దేవుని ముందు మోకరిల్లారు. దయామయుడైన దేవునికి వారి వైఖరి నచ్చింది. వారిపై కరుణ చూపి వారిని క్షమించాడు. "షైతాన్ మీకు బద్ధశత్రువు. ఇక ముందు వాడి మాటలకు మోసపోవద్దు" అని హితవు పలికాడు.

ఆ సంఘటన తర్వాత వారిని స్వర్గలోకం నుంచి దేవుడు భూలోకానికి పంపించేశాడు. "కొంతకాలం మీరు భూలోకానికి వెళ్ళండి. నా ప్రసన్నత పొందే అన్ని పనులు అక్కడ చేయండి" అని ఆదేశించాడు. భూలోకంలో ఎలా మెలగాలో, చేయవలసిన పనులేమిటో, చేయకూడని పనులేమిటో వారికి తెలియజేశాడు. ఆ విధంగా భూమండలంలో హజ్రత్ ఆదమ్ తొలి మానవుడిగా, దేవుడు పంపించిన తొలి ఖలీఫాగా, తొలి ప్రవక్తగా వచ్చారు. ఆయన సంతానమే యావత్తు మానవాళి. అంటే మానవులందరూ సోదరులు.

"మీలో మంచి పనులు చేసినవారు దైవప్రతినిధులమని గుర్తించి, తదనుగుణంగా దైవప్రసన్నత పొందేలా నడుచుకున్నవారు, తమ జీవితాలను తీర్చిదిద్దుకున్నవారు మరణించి మా వద్దకు వచ్చినప్పుడు వారికి మేము స్వర్గం అనుగ్రహిస్తాము. మా మాటలను ధిక్కరించి షైతాను అడుగుజాడల్లో నడిచినవారందరూ షైతాన్‌తో పాటు నరకానికి పోవలసి ఉంటుందని" అల్లాహ్ స్పష్టంగా తెలియజేశాడు.

షైతాన్ లేదా దుష్టశక్తి ప్రతి మనిషి అంతరంగంలో కాపు కాచుకుని ఉంటాడు. మనిషిని దారి తప్పిస్తాడు. ప్రలోభపెడతాడు. భయపెడతాడు. ఆశ చూపిస్తాడు. వీటన్నింటిని అధిగమించి, అణచివేసి మనిషి మనిషిగా నిరూపించుకోవడమే ఈ లోకంలో మనిషి ముందున్న పరీక్ష.

# ఆరోగ్యానికి ఇస్లాం అభయం



**అర్షియా**

**ఆరోగ్యమే మహా భాగ్యం.** అలాంటి ఆరోగ్యం కోసం ఇస్లాంలో ఎన్నో ఆరోగ్య సూత్రాలను పొందుపరిచారు. రోగాల నివారణకు మందులు వాడటంతో పాటు దైవాన్ని ప్రార్థించాలని ప్రవక్త బోధించారు. వివిధ రోగాల చికిత్సకు వాడాల్సిన మందులనూ తెలిపారు. దైవ ప్రవక్త(స) వైద్య విధానం (తిబ్బె నబవీ) పుస్తకంలో ఈ వివరాలను హాఫిజ్ నజర్ అహ్మద్ పొందుపరిచారు. ఆరోగ్య పరిరక్షణకు నాలుగు నియమాలను దైవప్రవక్త(స) సూచించారు. అవి వంట పాత్రల్ని, నీటి కడవలు, కుళాయిల్ని మూసి ఉంచడం, ఇంట్లో తలుపుల్ని మూసి ఉంచడం, నిద్రిస్తున్న వేళ దీపాలను ఆర్పివేయడం. మూత్ర విసర్జనకు ఆరోగ్యకర పద్ధతులను తెలిపారు. తుమ్ము దుశ్శకునం కాదన్నారు. ఆవలింత షైతాన్ చేష్ట అని.. వీలైనంత వరకు దాన్ని నిరోధించే ప్రయత్నం చేయాలని చెప్పారు. ఇస్లాం ప్రకారం వ్యాధి అనేది దేవుని తరపున దాసునికి పెట్టిన పరీక్ష. వ్యాధి దేవుడి నుంచే వస్తుంది. దాని మందును కూడా ఆయనే సృష్టిస్తాడు. ఆ మందును ఎలా వాడాలో వైద్యుల చేత చెప్పిస్తాడు. అంటే రోగం నయం అయ్యే విషయం దేవుడి చేతిలో ఉంటుందనేది ఇస్లాం ఉద్దేశం. కాబట్టి నిరాశ చెందాల్సిన అవసరం లేదు. నయం కాని వ్యాధి అంటూ ఏదీ లేదు. ప్రతి వ్యాధికి ప్రత్యేక చికిత్స, మందు ఉంటాయి. స్వస్థత లభిస్తుందని దేవుడిపై ఆశ పెట్టుకోవాలి. అశుద్ధ వస్తువులను మందులుగా వాడకూడదు. హాని చేసే మందులు వాడకూడదు. రోగం నయం కావడానికి మందును సాధనంగా భావించి స్వస్థత చేకూర్చమని అల్లాహ్‌ను ప్రార్థించాలి.

వివిధ రోగాలకు మందుగా ఉపయోగపడే సుగంధ ద్రవ్యాలు, మొక్కలు, పండ్ల గురించి దైవప్రవక్త(స) చక్కగా వివరించారు. గోరింటాకు, షిబ్రమ్ అనే గడ్డి జాతి మొక్కలను వివిధ వ్యాధులకు మందుగా వాడతారు. తేనె అనేక రోగాలకు ఔషధంగా ఉపయోగపడుతుంది. ప్రతి నెలా మూడుసార్లు తేనె సేవిస్తే ఎలాంటి పెద్ద వ్యాధులు రావని దైవప్రవక్త (స) తెలిపారు. సునాముఖి ఆకులో మృత్యువుకు తప్ప ప్రతి వ్యాధికి మందు ఉందని ఆయన వెల్లడించారు. ముసాంబ్రం అనే నల్లని దినుసును విరేచనాలకు మందుగా వాడతారని

చెప్పారు. స్వచ్ఛమైన సుర్మా కంటి చూపును పెంచుతుందని చెప్పారు. దైవప్రవక్త (స) తెలిపిన దాని ప్రకారం.. చంగల్వ కోష్టు త్రిదోషాలతోపాటు అనేక రోగాలను హరిస్తుంది. కలోంజీ గింజలు చాలా రోగాలకు మంచి ఔషధంగా పని చేస్తాయి. మీకు బాధగా ఉన్నప్పుడు కలోంజీ గింజలను తిని నీరు, తేనె తాగండి అని దైవప్రవక్త(స) సలహా ఇచ్చారు. జ్వరానికి చన్నీళ్లతో చేసే చికిత్స గురించి ఇమాజ్ రాజీ కబీర్ అనే పుస్తకంలో పేర్కొన్నాడు.

పుట్టగొడుగులు కండ్ల కలకు దివ్యౌషధం. ఉప్పు మలబద్ధకాన్ని, పుల్లటి తేన్పులను ఆపుతుంది. తేలు కాటుకు ఉప్పు నీటిని ఔషధంగా వాడతారు. దైవప్రవక్త వివిధ వ్యాధులకు మందులనే కాకుండా వాటికి వైద్య విధానాలనూ సూచించారు. నడుం నొప్పి, ఉదర వ్యాధులు, శరీర బలహీనతతో బాధ పడేవారికి బార్లీ గంజి మంచి ఆహారమని తెలిపారు. దైవప్రవక్త(స) గాయాలకు ఖర్జూరపు చాప ముక్క బూడిదతో కట్టు కట్టేవారు. న్యూమోనియాకు జైతూన్ తైలం(ఆలీవ్ ఆయిల్) మంచి ఔషధంగా పని చేస్తుంది. బేదానా(సఫర్ జల్) వాంతుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఖర్జూర పండ్లలో అనేక పోషక విలువలు ఉంటాయి. అజ్వా ఖర్జూరం విషానికి విరుగుడుగా పని చేస్తుందని దైవప్రవక్త (స) సెలవిచ్చారు. ఖర్జూరాల్లో శ్రేష్ఠమైన బర్నీ ఖర్జూరం కొన్ని వ్యాధులకు ఔషధంగా పని చేస్తుందని చెప్పారు. అంజీర్ మొలలు, కీళ్ల నొప్పులకు బాగా పని చేస్తుంది.

నమాజ్‌కు శారీరక, మానసిక స్వస్థత చేకూర్చే శక్తి ఉందని దైవప్రవక్త (స) వెల్లడించారు. రోగాలు నయం కావడానికి దరూద్ పఠించాలని తెలిపారు. ఖుర్ఆన్‌లో ఆయాతె షిఫాగా పేర్కొనే బిస్మిల్లాహ్, ఫాతిహా సురాతో పఠించి రోగిపై ఊదితే ప్రతి వ్యాధి దూరమవుతుందని భరోసా ఇచ్చారు. దీర్ఘాయుష్షు, శుభాభివృద్ధుల కోసం విచారాన్ని, ఆందోళనను పాగొట్టే ప్రార్థనలను తెలిపారు.

# నేను మీ నాన్నను...!

నేను మీ నాన్నను
నా కలల్ని త్యాగం చేసుకుని
మీ కలలను సాకారం చేశాను
మీరు సుఖాలను పొంది
నాకు ప్రతిగా ఏమిచ్చారు..?
బహుమతిగా ఇచ్చిందేమిటి...?
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ...?
వినండి నా ప్రియ తనుజులారా...
నా కథను,గాధను
ఎప్పుడైనా అడిగారా...?
"నాన్న ఎటు వెళ్లింది మీ రంగుల బాల్యం" అని...?
గుర్తుంచుకోండి మీరు లేని ప్రపంచాన్ని నేను
ఊహించలేదు...!
నా "యవ్వనం" మొత్తాన్ని మీ "క్షేమం" కోసమే
ధారపోశాను.
మీరు యవ్వనంలో నేను వృద్ధాప్యంలో..!
చూస్తుండగానే రోజులు గడిచి మృత్యువుకు దగ్గరగా..!
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ..?
నేను మీ నాన్నను
నా కలల్ని దూరం చేసుకుని
మీ కలల్ని సాకారం చేశాను....

**డాక్టర్. మహమ్మద్ హసన్**
**సహాయ ఆచార్యులు**
**సెల్ : 9908059234**






## కొత్త గ్రహాన్ని కనుగొన్న భారత శాస్త్రవేత్తలు

విశ్వంలో మరో కొత్త గ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అధునాతన స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఉపయోగించి ఆ గ్రహాన్ని గుర్తించామని.. ఇదో అద్భుత ఆవిష్కరణ అని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (పీఆర్ఎల్)కి చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఈ గ్రహాన్ని టీఓఐ-6651బీగా పిలుస్తున్నామని తెలిపారు. శని గ్రహం పరిణామంలో ఉన్న ఈ ప్రత్యేక గ్రహం.. సూర్యుడిని పోలిన నక్షత్రం చుట్టూ తిరుగుతోందని వెల్లడించారు. దీని కక్ష్య కొద్దిగా అండాకారంలో ఉందన్నారు. ఇక భూమితో పోలిస్తే ఈ గ్రహం బరువు 60 రెట్లు అధికంగా ఉంటుందని, పరిమాణంలో 5 రెట్లు పెద్దదని వివరించారు. ఈ గ్రహం అధిక సాంద్రతను బట్టి 87 రాతి, ఇనుము పదార్థాలను సూచిస్తుందన్నారు. హైడ్రోజన్, హీలియం వంటి తేలిక వాయువులు గ్రహంపై వ్యాపించి ఉండే అవకాశముందన్నారు.

## వాయు కాలుష్యంతో పెరుగుతున్న ఆస్తమా

వాయు కాలుష్యం కారణంగా పిల్లలు, పెద్దల్లో ఆస్తమా వ్యాధి పెరుగుతున్నట్టు ప్రపంచస్థాయి అధ్యయనంలో వెల్లడయింది. 2019-23 మధ్య 22 దేశాల్లో 68 చోట్ల జరిపిన అధ్యయనంలో ఈ విషయం రుజువయింది. మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది. దీనిపై విశ్లేషించిన శాస్త్రవేత్త రూయిజింగ్ నీ 'వన్ ఎర్త్' మ్యాగజైన్‌లో వ్యాసం రాశారు. వాయు కాలుష్యాన్ని 'ఫైన్ పర్టిక్యులర్ మ్యాటర్ (పీఎం 2.5)గా లెక్కిస్తారు. గాలిలో కాలుష్యకారక సూక్ష్మ రేణువులు ఎన్ని ఉన్నాయన్నది దీని ద్వారా తెలుస్తుంది. ప్రతి ఘనపు మీటరు గాలిలో 10 మైక్రోగ్రాముల మేర పీఎం2.5 పెరిగితే ఆస్తమా వచ్చే ముప్పు 21% మేర అధికమవుతుందని అధ్యయనంలో తేలింది.

## వచ్చే ఏడాది జనగణన

చాలాకాలంగా ఆలస్యమవుతూ వస్తున్న జనగణన ప్రక్రియను కేంద్రం వచ్చే ఏడాది మొదట్లోనే చేపట్టి.. 2026 కల్లా జాతీయ జనాభా పట్టికను నవీకరించి, ఆ వివరాలను ప్రజలకు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే, విపక్షాలు డిమాండ్ చేస్తున్న కులగణన విషయంపై మాత్రం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో జనగణన చక్రం 2035, 2045.. అలా మారుతుందని ఆ వర్గాలు వివరించాయి. వచ్చే ఏడాది చేపట్టే జనగణన పూర్తయ్యాక.. 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉంది. కాగా.. 1951 నుంచి ప్రతి పదేళ్లకొకసారి మన దేశంలో జనగణన జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే, 2021లో కరోనా కారణంగా జరగలేదు. అప్పట్నుంచీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఈసారి కులగణన కూడా చేపట్టాలని, దానివల్ల దేశంలో ఓబీసీ జనాభా ఎంతో తెలుస్తుందని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

## వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాల నిరసన

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. ఈ సమావేశాన్ని వాకౌట్ చేశాయి. జేపీసీ చైర్మన్, బీజేపీ ఎంపీ జగదాంబిక పాల్ అధ్యక్షతన పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం జరిగింది. ఢిల్లీ వక్ఫ్ బోర్డు సమర్పించిన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఎంపీలు ఆ సమావేశాన్ని వాకౌట్ చేశారు. ఢిల్లీ ప్రభుత్వ అనుమతి లేకుండానే.. ఢిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ మీటింగ్‌లో ప్రజెంటేషన్ ఇచ్చారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజరు సింగ్, డీఎంకే ఎంపీ ముహమ్మద్ అబ్దుల్లా, కాంగ్రెస్ ఎంపీలు నసీర్ హుస్సేన్, ముహమ్మద్ జావెద్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సమావేశం నుంచి వాకౌట్ చేసి తమ నిరసన తెలిపారు. అనంతరం కొంత సమయం తరువాత ఎంపీలు తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అనుమతి లేకుండానే వక్ఫ్ బోర్డు ప్రాథమిక నివేదికను పూర్తిగా మార్చేశారని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) కమిషన్, ఢిల్లీ వక్ఫ్ బోర్డు అడ్మినిస్ట్రేటర్ అశ్విని కుమార్‌పై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఈ సమావేశానికి టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ గైర్హాజరుతో గందరగోళం నెలకొంది. మరోవైపు వక్ఫ్ బిల్లుకు ప్రతిపాదించిన సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశి జేపీసీకి లేఖ రాశారు. ఈ బిల్లుపై జేపీసీ ఢిల్లీ ప్రభుత్వం నుంచి స్పందన కోరింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆతిశి ఈ బిల్లును 'అనవసరం, వ్యర్థం' అని పేర్కొన్నారు. లోగడ జేపీసీ సమావేశంలో టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ ఒక్క రోజు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అద్దాలు పగిలి కళ్యాణ్ బెనర్జీ చేతికి గాయమైంది. కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఆగస్టు 8న లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లును తీవ్ర వ్యతిరేకత, గందరగోళం మధ్య ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింల మత స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తోందని పేర్కొంటూ ప్రతిపక్షం ఏకకాలంలో బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సుదీర్ఘ చర్చ అనంతరం ఏకాభిప్రాయం కోసం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపాలని కేంద్రం నిర్ణయించింది.




## ఇరాన్‌పై దాడికి పలు దేశాల ఖండన

ఇరాన్‌పై ఇజ్రాయిల్ దురాక్రమణపూరిత దాడిని పలు దేశాలు ఖండించాయి. పశ్చిమ దేశాలు మాత్రం మౌనం వహించాయి. ఫ్రాన్స్ వంటి దేశం స్పందించినా ఇజ్రాయిల్ దాడిని నేరుగా ఖండించలేదు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ నైరుతి ప్రాంతంపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిని సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్, ఖతార్, ఈజిప్టు, యెమెన్, మలేసియా, సిరియా, జోర్డాన్, లెబనాన్ తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి. సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన చేస్తూ, ఇజ్రాయిల్ దాడి ఇరాన్ సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఇజ్రాయిల్ చర్యను ఇరాన్ సార్వభౌమత్వంపై దాడిగానే పరిగణిం చాలని ఖతర్ వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఖతర్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ప్రాంత భద్రత, సుస్థిరతను సవాల్ చేసే ఏ చర్యను అంగీకరించబోమని ఈజిప్టు స్పష్టం చేసింది.

## అమెరికాలో ఆర్థిక ఎమర్జెన్సీ

అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక అత్యవసర స్థితిలోకి వెళ్లిపోయిందని ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులపై ప్రభుత్వం చెల్లిస్తున్న వడ్డీలు ఏడాదికి ట్రిలియన్ డాలర్లు (రూ.84 లక్షల కోట్లు) దాటిపోయాయని, రక్షణ రంగానికి చేసిన కేటాయింపుల కంటే ఇది ఎక్కువని పేర్కొన్నారు. ఇటీవల ట్రంప్ ఎన్నికల ప్రచార ర్యాలీలో మస్క్ మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వడ్డీ చెల్లింపులు ఫెడరల్ ట్యాక్స్ ఆదాయంలో 23 శాతమని తెలిపారు. జాతీయ రుణం 35.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ రుణం 36 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేసినట్టు వివరించారు.

## చైనాలో వేలాది కిండర్ గార్డెన్స్ మూత

చైనాలో జననాల రేటు పడిపోవడంతో వేలాది కిండర్ గార్డెన్స్ మూత పడుతున్నాయి. 2023లో 14,808 కిండర్ గార్డెన్స్ మూత పడినట్లు చైనా విద్యా శాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. వరుసగా మూడు సంవత్సరాల నుంచి కిండర్ గార్డెన్‌లో చేరే చిన్నారుల సంఖ్య తగ్గిపోతున్నది. గత ఏడాది అంతకుముందు సంవత్సరం కన్నా 53.5 లక్షల మంది చిన్నారులు తగ్గిపోయారు. 2023లో 5,645 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. చైనా ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే మందగమనంలో ఉంది. జననాల రేట్లు మొత్తం జనాభాకు అనుగుణంగా లేవు. మరోవైపు వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో జనాభాలో అసమతుల్యత వల్ల భవిష్యత్తులో ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

## ప్రపంచ ప్రకృతి పరిరక్షణ సూచీలో అట్టడుగున భారత్ ర్యాంకు

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ సూచీ (గ్లోబల్ నేచర్ కన్జర్వేషన్ ఇండెక్స్) 2024లో భారత ప్రదర్శన దారుణంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలకు ఇందులో ర్యాంకులు కేటాయించగా.. భారత్ 176వ స్థానంలో ఉన్నది. 100కు గానూ 45.5 స్కోర్ మాత్రమే సాధించిన భారత్ అట్టడుగున నిలిచింది. ఈ జాబితాలో భారత్ తర్వాత స్థానాల్లో కిరిబాటి(180), టర్కీ(179), ఇరాక్ (178), మైక్రోనేషియా(177) దేశాలున్నాయి. భూమి నిర్వహణ, జీవ వైవిధ్యం, పాలన, సామర్థ్యం, భవిష్యత్తు పోకడలు ఎదుర్కొంటున్న ముప్పులు వంటి అంశాలను ఈ సూచికలో పరిగణలోకి తీసుకుంటారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణను సమతుల్యం చేయటంలో ప్రతీ దేశం సాధించిన పురోగతిని ఇందులో అంచనా వేస్తారు. ఇజ్రాయెల్‌కు చెందిన బెన్-గురియన్ యూనివర్సిటీ ఆఫ్ నెగెవ్, లాభాపేక్షలేని వెబ్‌సైట్ బయోడీబీలు దీనిని రూపొందించాయి. జీవ వైవిధ్యానికి పెరుగుతున్న ప్రమాదాలు, భూమి అసమర్థ నిర్వహణ కారణంగా భారత్ అత్యల్ప ర్యాంకుకు కారణమని సూచీ పేర్కొన్నది. పట్టణ, పారిశ్రామిక, వ్యవసాయ అవసరాల కోసం భూమార్పిడి 53 శాతానికి చేరినందున స్థిరమైన భూ వినియోగ పద్ధతులు అవసరమని పరిశోధకులు చెప్పారు. వ్యవసాయం, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధితో ఆవాసాలు కోల్పోవటం వంటి అనేక అంశాలు దేశ జీవ వైవిధ్యానికి ప్రమాదాలు కలిగిస్తున్నాయని కూడా వారు అన్నారు. దేశంలో 2001 నుంచి 2019 మధ్య కొనసాగుతున్న అటవీ నిర్మూలన కారణంగా 23,300 చదరపు కిలోమీటర్లలో చెట్ల స్థలం పోయిందని పేర్కొన్నది. భారత్ భయంకరమైన జీవ వైవిధ్య సవాళ్లను ఎదుర్కొంటున్నదని పరిశోధకులు చెప్పారు. స్థిరమైన అభివృద్ధికి తోడ్పడే నిబంధనలను తయారు చేయటం, పర్యావరణ పరిరక్షణకు నిధుల కేటాయింపు, సమర్థవంతమైన పరిరక్షణ చర్యలను ప్రోత్సహించటం ప్రభుత్వాల అంకితభావంపై ఆధారపడి ఉంటుందని పరిశోధకులు సూచిస్తున్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- ముహమ్మద్ అజ్గర్ అలీ

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)** అనేది మానవ మెదడు వలె పని చేసే సాంకేతికత. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్లు కష్టమైన పనులను సులభతరం చేస్తాయి. సమయం, డబ్బు, కృషిని ఆదా చేస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సానుకూల, ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ అవలంబించాల్సి ఉంటుంది. ఏఐ ఉపయోగించని వారు వెనుకబడిపోతారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా ఆధారంగా పని చేస్తుంది, అంటే దానిలో డేటా ఎంత మెరుగ్గా ఉంటే, దాని పనితీరు అంత మెరుగ్గా ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఆరోగ్యం, విద్య, వాణిజ్యం, అనేక ఇతర రంగాలలో అభివృద్ధి చేస్తున్నారు. ఏఐ నిరంతరం అభివృద్ధి చెందుతోంది. జీవితంలోని ప్రతి రంగంలో ఏఐని చేర్చేందుకు కృషి చేస్తున్నారు.

ఏఐ/కృత్రిమ మేధస్సు నిస్సందేహంగా సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కృత్రిమ మేధస్సును ఉపయోగించడం ద్వారా మన సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది. జాబ్ మార్కెట్‌లో మార్పులను తీసుకు వస్తుంది. కృత్రిమ మేధస్సు నిపుణులు, డేటా విశ్లేషకులు, రోబోటిక్స్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు ఇప్పటికే పెరుగుతున్నాయి.

ఏఐ/కృత్రిమ మేధస్సు మొబైల్ విప్లవంతో పోల్చదగినది. ఏఐ ఆగమనంతో వచ్చిన మార్పు జీవితంలోని ప్రతి రంగంలోనూ కనిపిస్తుంది. అది మానవ జీవన నాణ్యతలో మెరుగుదలకు దారి తీస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటాను విశ్లేషించడం ద్వారా మనకు మెరుగైన కంటెంట్‌ను అందిస్తుంది.

నిస్సందేహంగా, కృత్రిమ మేధస్సు భవిష్యత్తులో ఉద్యోగాలకు అవసరమైన కొత్త విషయాలను తెలుసుకోవడానికి ప్రజలకు అవకాశం ఇస్తుంది. కృత్రిమ మేధస్సు విద్యార్థులకు ఒక వరం. విద్యా రంగాన్ని మారుస్తుంది. విద్యార్థులు, బోధన, పరిశోధన రంగంలో నిమగ్నమైన వ్యక్తులు కృత్రిమ మేధస్సుతో తమ జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు విద్యా రంగానికి చాలా ఉపయోగపడుతుంది.

2021 తర్వాత, ఏఐ సమాజాన్ని మార్చడం ప్రారంభించింది. కృత్రిమ మేధస్సు డేటా, అల్గారిథమ్‌లపై పనిచేసే సాఫ్ట్‌వేర్. డేటా ఎంత మెరుగ్గా ఉంటే అంత మంచి ఫలితం ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం టెక్నికల్ ఉద్యోగాలను భర్తీ చేయగలదు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పని చేసే వ్యక్తుల సంఖ్య తగ్గవచ్చు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని మెరుగ్గా ఉపయోగించే వ్యక్తులు తమ సహోద్యోగుల కంటే మెరుగ్గా పని చేస్తారు.


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెద్ద మొత్తంలో డేటాను సేకరిస్తుంది, ప్రాసెస్ చేస్తుంది కాబట్టి, ఇది ప్రైవేట్ సమాచారాన్ని రక్షించడంలో సమస్యను కలిగిస్తుంది.

నకిలీ ఫోటోలు, నకిలీ వార్తలు లేదా ప్రచారం కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. దీని కోసం, కృత్రిమ మేధస్సును ఎవరూ దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం సరైన వ్యూహాన్ని రూపొందించాలి. ఏది నకిలీ, ఏది కాదో తెలియజేయడానికి వీలు కల్పించే యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలి. ఏఐని ఉపయోగించడం వల్ల వ్యక్తుల సృజనాత్మకత తగ్గుతుంది.

ఏఐ పరంగా భారతదేశం ఇంకా వెనుకబడి ఉంది, కొన్ని కంపెనీలు ఏఐ విషయంలో పనిచేస్తున్నాయి. మొత్తానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయంలో సమాజం తనను తాను అప్‌డేట్ చేసుకోవాలి. పాత తరం వారు మొబైల్‌తో ఎలా అప్‌డేట్ అయ్యారో, ఆపరేట్ చేయడం నేర్చుకున్నారో, అదే విధంగా, ఉ ఏఐ గురించి మనం అప్‌డేట్ చేసుకోవాలి. నిరక్షరాస్యులు లేదా తక్కువ అక్షరాస్యత ఉన్నవారు కృత్రిమ మేధస్సును అర్థం చేసుకోవడంలో, ఉపయోగించడంలో వెనుకబడి ఉంటే మరింత వెనుకబడిపోయే అవకాశం ఉంది.

ఏఐ వలన విద్యా నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా ఆరోగ్యం, వాణిజ్యం, మన ఆర్థిక వ్యవస్థ కూడా మెరుగుపడవచ్చు.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**